


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | మంగళవారం 1-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 251 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## ఈపీఎఫ్‌వో రిలీఫ్.. సభ్యులకు రెండో కోవిడ్ అడ్వాన్స్!

న్యూఢిల్లీ, మే 31: ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యులకు గొప్ప రిలీఫ్. కరోనా వేళ తన సబ్‌స్క్రైబర్లకు మద్దతుగా నిలిచేందుకు ముందుకు వచ్చింది. సబ్‌స్క్రైబర్లు తమ ఈపీఎఫ్ డిపాజిట్ల నుంచి మరో దఫా నాన్–రీఫండబుల్ అడ్వాన్స్ తీసుకునేందుకు అనుమతినిచ్చింది. ఆదివారం జరిగిన ఈపీఎఫ్‌వో గవర్నింగ్ బాడీ సమావేశం ఈ నిర్ణయం తీసుకున్నది.

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజనా (పీఎంజీకేవై) కింద గతేడాది మార్చిలో కరోనా మహమ్మారి వేళ.. ఆర్థిక అవసరాలను తీర్చేందుకు ఈపీఎఫ్ డిపాజిట్ల నుంచి ప్రత్యేక విత్‌డ్రాయల్స్‌కు నిబంధన జత చేసింది.

ఈ నిబంధన కింద తమ సబ్‌స్క్రైబర్ల మూడు నెలల కనీస వేతనం ప్లస్ కరువు భత్యం/ ఈపీఎఫ్ ఖాతాలో సభ్యుడి క్రెడిట్‌లో 75 శాతంల్లో ఏది తక్కువైతే దాన్ని విత్ డ్రా చేసుకోవచ్చు.

ఈపీఎఫ్‌వో రిలీఫ్.. సభ్యులకు రెండో కోవిడ్ అడ్వాన్స్!

నెలసరి వేతనం రూ.15 వేల లోపు ఉన్న ఈపీఎఫ్ సభ్యులకు కరోనా మహమ్మారి వేళ కోవిడ్–19 అడ్వాన్స్ గొప్ప సహాయకారిగా ఉంటుంది. ఇప్పటివరకు కోవిడ్–19 అడ్వాన్స్ కోసం 76.31 లక్షల క్లెయిమ్‌లకు పైగా ఆమోదించింది. దీని కింద రూ.18,698.15 కోట్లు పంపిణీ చేసింది.

కరోనా మహమ్మారి సెకండ్ వేవ్‌తోపాటు బ్లాక్ ఫంగస్‌ను అంటువ్యాధిగా కేంద్రం ప్రకటించింది. కనుక తమ సభ్యులు తొలిదఫా కోవిడ్–19 అడ్వాన్స్ మాదిరిగానే రెండో దఫా అడ్వాన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ అడ్వాన్స్ టైంలో మాదిరే ఇప్పుడు విత్‌డ్రాయల్స్ కోసం ప్రాసెస్ చేసుకోవాలి.

ఇందుకోసం ఈపీఎఫ్‌వో ఆటో–క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రాసెస్ పేరిట ఒక వ్యవస్థను రూపొందించింది. సభ్యులు కేవైసీ సమర్పించిన తర్వాత క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. మామూలుగా ఈ క్లెయిమ్‌లను ఆమోదించడానికి 20 రోజులు పడుతుంది.

## ఈటెల చేరికపై కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్ , మే 31: తెలంగాణ రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మాజీ మంత్రి ఈటెల రాజేందర్ బీజేపీలో చేరబోతున్నట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్ ని గద్దె దించడానికి అందరూ కలిసి రావాలని నియంతృత్వ పాలనను ఎదుర్కోవడానికి పార్టీని బలోపేతం చేస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. ఈటెల రాజేందర్ ఢిల్లీలో బిజెపి నాయకులను కలుస్తారని? బండి సంజయ్ నాతో చర్చించిన తర్వాతే ఈటెల ఢిల్లీ వెళ్లారని అన్నారు.

పార్టీ లో ప్రస్తుతం సానుకూల వాతావరణం ఉంది. పార్టీ బలోపేతానికి అందరూ సహకరించాలి. అసంతృప్తులు సహజం గా ఉంటాయి. సీనియర్ నేత పెద్దిరెడ్డి అసంతృప్తిని పార్టీలో చర్చిస్తాం. పెద్దిరెడ్డి నన్ను విమర్శించినంత మాత్రాన నేను స్పందించాల్సిన అవసరం లేదు. మొదటి నుంచి కూడా మంచి కేసీఆర్ కు చెడును మోదీకి తగిలించటం టిఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిపోయిందని చెప్పుకొచ్చారు కిషన్ రెడ్డి.

## దేశంలో థర్డ్ వేవ్.. 8 వేల మంది పిల్లలకు వైరస్!

న్యూఢిల్లీ, మే 31: కరోనా సెకండ్ వేవ్ తో విలవిలలాడిన భారత్ కు ఇప్పుడు థర్డ్ వేవ్‌లో టెన్షన్ పట్టుకుంది. కొన్ని రాష్ట్రాల్లో థర్డ్ వేవ్ క్రమంగా వ్యాప్తిస్తోంది. దేశంలో కోవిడ్ వైరస్‌కు అధికంగా ప్రభావితమైన రాష్ట్రాల్లో ముందు వరుసలో ఉన్న మహారాష్ట్రను థర్డ్ వేవ్ కలవరపెడుతోంది. మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లాలో 8 వేల మందికి పైగా చిన్నారులకు కోవిడ్ సోకింది. దీంతో వారికి చికిత్స అందించేందుకు ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేకంగా కోవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రస్తుతం ఐదుగురు పిల్లలు చికిత్స పొందుతున్నారు.

మూడో దశలో కరోనా చిన్నారులను టార్గెట్ చేస్తుందని నిపుణులు హెచ్చరికలు జారీ చేయడంతో పలు రాష్ట్రాలు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నాయి. థర్డ్‌వేవ్ గురించి స్థానిక కార్పొరేటర్ అభిజిత్ భోశ్లే మాట్లాడుతూ.. మే నెలలో 8వేల మంది చిన్నారులు కరోనా బారిన పడ్డారని, థర్డ్‌వేవ్ వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైరస్ సోకిన చిన్నారులకు చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

మరోవైపు జిల్లాలోని చిన్నారుల్లో 10శాతం మందికి కరోనా కేసులు నమోదయ్యాయని అహ్మద్ నగర్ జిల్లా కలెక్టర్ తెలిపారు. థర్డ్ వేవ్ నుంచి పిల్లలను రక్షించుకునేందుకు చిన్న పిల్లల వైద్యులతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే సంగ్రామ్ జగ్తాప్ మాట్లాడుతూ.. " సెకండ్ వేవ్ సమయంలో పడకలు, ఆక్సిజన్ కొరత ఏర్పడింది. కాబట్టి, మూడవ దశ సమయంలో మనం దానిని నివారించాలి. థర్డ్ వేవ్ వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి" అని అన్నారు. మరోవైపు మహారాష్ట్రలో కరోనా క్రమంగా తగ్గుతున్నా.. మరణాలు మాత్రం అధిక సంఖ్యలో కొనసాగుతున్నాయి.

## సీఎం కేసీఆర్‌ను కలిసిన బెల్లంపల్లి ఎమ్మెల్యే



హైదరాబాద్ , మే 31: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తన పుట్టిన రోజు సందర్భంగా ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను సోమవారం కలిశారు. మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఎమ్మెల్యే చిన్నయ్య ఆశీస్సులు తీసుకున్నారు. మంచిర్యాల జిల్లాకు కేటాయించిన మెడికల్ కాలేజీని బెల్లంపల్లి పట్టణంలోనే నిర్మించాలని సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే చిన్నయ్య విజ్ఞప్తి చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ స్థలం బెల్లంపల్లి పట్టణంలో ఉందన్నారు. ప్రజా రవాణాకు అనుకూలంగా ఉందన్నారు.

బెల్లంపల్లి పట్టణంలో మెడికల్ కాలేజీ నిర్మిస్తే.. మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు, మంచిర్యాల, చెన్నూరు, ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు మధ్యలో ఉంటుందని తెలిపారు. దీంతో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తుందని సీఎంకు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే చిన్నయ్య చెప్పారు.

## ఆనందయ్య మందుతో కరోనా తగ్గిందని చెప్పిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ మృతి

అమరావతి, మే 31: : ఆనందయ్య తయారు చేసిన మందుతో కరోనా తగ్గిందని ప్రకటించిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కోటయ్య మృతిచెందారు. కరోనా సోకడంతో పది రోజుల క్రితం నెల్లూరులోని జీజీహెచ్‌లో చేరారు. నాలుగు రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ సోమవారం ఉదయం చనిపోయారు.నెల్లూరు జిల్లాకు చెందిన కోటయ్య.. తనకు కరోనా సోకిన తర్వాత ఆనందయ్య ఔషధాన్ని తీసుకున్నారు. అనంతరం కోలుకున్నట్లు ప్రకటించారు. దీంతో ఆనందయ్య ఔషధం వెలుగులోకి వచ్చింది. అప్పట్లో సోషల్ మీడియాలో కోటయ్య వీడియోలు వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కోటయ్యకు ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడంతో జీజీహెచ్‌లో చేరారు. పరిస్థితి విషమించి ఇవాళ మరణించారు.

## ఆనందయ్య మందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది !!

అమరావతి, మే 31: దేశంలో కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇటువంటి సమయంలో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ఆనందయ్య ముందు తెరపైకి వచ్చింది. అందరూ కూడా ఆనందయ్య మందు కోసం క్యూ కట్టారు. కానీ సర్కారు మాత్రం ఆ మందు పై పూర్తిస్థాయిలో నివేదిక వచ్చే వరకు నిలిపివేస్తున్నట్లు ఆదేశాలను జారీ చేసింది. కాగా ఈ మూలికలు వైద్యం చేస్తున్న ఆనందయ్య మందుకు తాజాగా ఏపీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కంట్లో వేసే మందు అలాగే కే అనే మందును మాత్రం తాత్కాలికంగా నిలిపివేసింది. ఆనందయ్య ఇచ్చే పి, ఎల్, ఎఫ్ అనే మందులు వాడేందుకు ప్రభుత్వం అంగీకరించింది. సీసీఆంఏఎస్ నివేదిక ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆనందయ్య వేస్తున్న కంట్లో మందులపై పూర్తి నివేదకలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయి. ఇతర మందులతో ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేసింది.అయితే, ఈ మందు వల్ల కరోనా వైరస్ తగ్గుతుందని? రాకుండా ఉంటుందని మాత్రం నివేదిక ధృవీకరించలేదు. ప్రజలు తమకు ఇష్టమైతే తీసుకోవచ్చని, ఇక ఆనందయ్య మందు తీసుకునే సమయంలో కరోనా ప్రోటోకాల్ పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. కంట్లో వేసే మందుపై నివేదికలు రావడానికి ఇంకో మరో 2?3 వారాల సమయం పట్టే అవకాశం ఉంది. అయితే, ఆనందయ్య మందు వాడినంత మాత్రాన మిగిలిన మందులు ఆపొద్దని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. డాక్టర్లు ఇచ్చిన మందులు వాడుతూ.. ఆనందయ్య మందును వాడుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. అయితే ఆనందయ్య మందును తీసుకోవటానికి కరోనా రోగులు రావొద్దని స్పష్టం చేసింది. ఇదే అంశాన్ని ప్రభుత్వం హైకోర్టుకు తెలపనుంది.

## ప్రయాణికులకు శుభవార్త.. నేటి నుంచి మెట్రో సేవల సమయం పెంపు

హైదరాబాద్ , మే 31: నగర ప్రయాణికులకు మెట్రో అధికారులు శుభవార్త వినిపించారు. జూన్ 1వ తేదీ నుంచి మెట్రో సేవల సమయాన్ని పెంచుతున్నట్లు అధికారులు ప్రకటించారు.

నేటి నుంచి ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెట్రో రైళ్లు ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి. చివరి రైలు ఒంటి గంటకు బయల్దేరి 2 గంటల వరకు చివరి స్టేషన్‌కు చేరుకోనుంది. లాక్‌డౌన్ సడలింపుల నేపథ్యంలో మెట్రో సేవల సమయాన్ని పొడిగించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక అన్ని రకాల ప్రజా రవాణాకు మరో గంట అదనంగా వెసులుబాటు కల్పించారు.

## మంత్రిని కలిసిన టీయూ వీసీ



హైదరాబాద్ , మే 31: తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ గుప్తా సోమవారం అరణ్య భవన్‌లో అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ రవీందర్ గుప్తా కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తూ తెలంగాణ యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కేసీఆర్ నాయకత్వంలోనే కొనసాగుతాం : కమలాపూర్ టీఆర్ఎస్ నాయకులు

### -కేసీఆర్ నాయకత్వంలోనే కొనసాగుతాం : కమలాపూర్ టీఆర్ఎస్ నాయకులు

వరంగల్,మే 31: : మేమంతా టీఆర్ఎస్‌లో ఉంటామని పార్టీ అభివృద్ధి కృషిచేస్తూ మా గ్రామాలను అభివృద్ధి చేసుకుంటామని హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు తెలిపారు. సోమవారం హన్మకొండలో కమలాపూర్ మండలం ఇంచార్జి, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేసున్న సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని వదిలే సమస్యలేదని, తామంతా టీఆర్ఎస్‌లోనే ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు.అనంతరం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసేవారికి పార్టీ అండగా నిలుస్తుందని, పార్టీ అధినేత సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు సూచనలతో అందరూ ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.

గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు.ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారిని కలిసిన వారిలో శ్రీరాములపల్లి, అంబాల, గూనిపర్తి, శనిగరం, దేశరాజుపల్లి, మాదన్నపేట, లక్కీపూర్, కానిపర్తి, నెరేళ్ల, శంభునిపల్లి, భీంపల్లి, పంగిడిపల్లి, గుండేడు, కొత్తపల్లి, గోపాల్ పూర్, ఉప్పల్, ఉప్పల్ పల్లి గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, రైతుబంధు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ పేరియాల రవీందర్ రావు, రెడ్ క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు, పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా రామకృష్ణ, నాయకులు పింగిలి ప్రదీప్ రెడ్డి, ఎర్రం ఇంద్రసేన రెడ్డి, టి.శ్రీకాంత్, ఎం.నవీన్ కుమార్, జెడ్పిటిసిలు సిలువేరు మొగిలి, కోడెపాక కరుణాకర్, ఎంపిపిలు మచ్చ రవీందర్, స్వర్ణలత, పాడి ప్రతాప్ రెడ్డి, తిప్పర్తి సాంబశివరెడ్డి, ఆముదాలపల్లి అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### టీఆర్ఎస్‌లో చేరిన వార్డు మెంబర్లు?

కమలాపూర్ మండలం దేశరాజుపల్లి గ్రామం కాంగ్రెస్ పార్టీకి చెందిన 8వ వార్డు సభ్యులు ఈసంపల్లి రమేష్, భీంపల్లి గ్రామం బీజేపీ పార్టీకి చెందిన వార్డు సభ్యులు అకినపల్లి రామ్మూర్తి ఆయా పార్టీలకు రాజీనామా చేసి కమలాపూర్ మండల ఇంచార్జి,పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు.

## ఇంటర్ ఆన్‌లైన్ తరగతులు వాయిదా

హైదరాబాద్ , మే 31: జూన్ 1వ తేదీన ప్రారంభం కావాల్సిన ఇంటర్ ఆన్‌లైన్ తరగతులు వాయిదా పడ్డాయి. సవరించిన షెడ్యూల్‌ను సాయంత్రం లోపు విడుదల చేస్తామని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఏటా జూన్ 1 నుంచే ఇంటర్ కాలేజీలు ప్రారంభవుతుండగా, గతేడాది కరోనా నేపథ్యంలో సెప్టెంబర్ నుంచి ఆన్‌లైన్ క్లాసులను ప్రారంభించారు. ఈ ఏడాది విద్యార్థులు నష్టపోకుండా జూన్ 1 నుంచే ఆన్‌లైన్ క్లాసులను ప్రారంభించాలని ఇటీవలే ఇంటర్ బోర్డు నిర్ణయించిన సంగతి తెలిసిందే. కానీ లాక్‌డౌన్ పొడిగింపు నేపథ్యంలో ఆన్‌లైన్ క్లాసులు వాయిదా పడ్డాయి.

## మెట్రో రైల్లో ప్రయాణించిన సీఎస్ సోమేశ్ కుమార్



హైదరాబాద్ , మే 31:తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ సోమవారం మెట్రో రైల్లో ప్రయాణించారు. ఖైరతాబాద్ నుంచి అమీర్‌పేట్ వరకు సీఎస్ ప్రయాణించి.. మెట్రోలో కరోనా జాగ్రత్తలపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. మెట్రోలో కరోనా నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలపై సీఎస్ సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎస్ సోమేశ్ కుమార్ వెంట మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి ఉన్నారు.

## పాత దొమ్మాటను సందర్శించిన రాష్ట్ర అడ్వకేట్ జనరల్

చేర్యాల/సిద్దిపేట, మే 31: : రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ బీవీ ప్రసాద్ ఆయన సొంత గ్రామమైన పాత దొమ్మాటను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ గ్రామ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఏజీ మంత్రి హరీశ్ రావుతో మాట్లాడడంతో వెంటనే మంత్రి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఏజీ వెంట జిల్లా కలెక్టర్ వెంకట్రామ్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్, సిద్దిపేట, హుస్నాబాద్, ఆర్డీవోలు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## ఐసోలేషన్ కేంద్రంతో నిరుపేదలకు మేలు



సంగారెడ్డి,మే 31: : కొవిడ్ ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటుతో నిరుపేదలకు ఎంతగానో మేలు జరుగుతుందని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లాలోని కోహిర్ మండలం కవేలి హోటల్ మేనేజ్ మెంట్ కళాశాల ఆవరణలో మాజీ జడ్పీటీసీ అరవింద్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ కేంద్రాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కరోనా సోకిన అనాథలు, నిరుపేదలు ఇందులో ఉంటే ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యంతో పాటు పౌష్టికాహారం అందజేస్తారని వివరించారు.

కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ట్రస్ట్ నిర్వాహకులు స్రవంతిరెడ్డి పాల్గొన్నారు.

## సురేందర్ రెడ్డికి నివాళులు అర్పించిన ఎంపీ సంతోష్ కుమార్

నిజామాబాద్ , మే 31:: జిల్లాలోని వేల్పూర్ క్రాస్ రోడ్ వద్ద మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తండ్రి, రైతు నాయకుడు స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి విగ్రహానికి రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రైతు నాయకుడిగా సురేందర్ రెడ్డి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం సురేందర్ రెడ్డి విగ్రహం వద్ద ఎంపీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇప్పటిదాకా 23 కోట్లకు పైగా టీకా డోసులు

న్యూఢిల్లీ, మే 31: కోవిడ్ మీద పోరులో భాగంగా భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, సోకినవారి ఆచూకీ కనిపెట్టటం, తగిన చికిత్స అందించటం, వ్యాప్తి నివారణకు తగిన జాగ్రత్తలు పాటించేయటం, టీకాలివ్వటం అనే ఐదు అంశాల ప్రాధాన్యంలో భాగంగా టీకాల మీద ప్రత్యేక దృష్టిసారించింది. భారత ప్రభుత్వ దేశవ్యాప్త టీకాల కార్యక్రమానికి అండగా ఉండి రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు టీకా డోసులు ఉచితంగా అందిస్తూ వచ్చింది. అంతే కాకుండా ఉత్పత్తి, సరఫరాను పెంచటానికి అనేక చర్యలు తీసుకుంటోంది.

మూడో దశ టీకాల కార్యక్రమాన్ని మరింత సరళంగా, వేగంగా అమలు చేయటం మే 1న మొదలైంది. ఈ వ్యూహంలో భాగంగా ప్రతి నెలలో సెంట్రల్ డ్రగ్స్ లేబరేటరీ (సిడిఎల్) ఆమోదించిన ఉత్పత్తి సంస్థలలో తయారైన 50% టీకా మందును కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రాష్ట్రాలు మిగిలిన 50% నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. ప్రభుత్వం అందించే టీకామందుని మునుపటిలాగానే రాష్ట్రాలకు ఉచితంగా పంపిణీ జరుగుతుంది.

భారత ప్రభుత్వం ఇప్పటిదాకా రాష్ట్రాలకు, కేంద్రపాలితప్రాంతాలకు 23 కోట్లకు పైగా (23,11,68,480) కోవిడ్ డోసులు ఉచితంగా అందజేసింది. ఇందులో రాష్ట్రాల వాడకం, వృధా కలిపి ఈ ఉదయం 8 గంటలవరకు అందిన సమాచారాన్ని బట్టి 21,22,38,652 డోసులు ఉన్నట్టు తెలుస్తోంది.

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల దగ్గర ఇంకా 1.75 కోట్లకు పైగా (1,75,48,648) టీకా డోసులు పంపిణీకి అందుబాటులో ఉన్నాయి. పైగా, మరో 2.73 లక్షలకు పైగా (2,73,970) టీకా డోసులు వచ్చే 3 రోజుల్లో కేంద్రప్రభుత్వం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపబోతోంది.

# ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏడేళ్లుగా అపూర్వ విజయాలు

న్యూఢిల్లీ, మే 31: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏడేళ్లుగా అపూర్వ విజయాలు సాధిస్తున్నదంటూ కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. దేశాభివృద్ధి, ప్రజా భద్రత, సంక్షేమం, మైలురాళ్ళ దాటటం అంతో సంస్కరణల మధ్య అసమాన సమన్వయానికి మోదీ ప్రభుత్వాన్ని ఒక విశిష్ట ఉదాహరణగా అభివర్ణిస్తూ శ్రీ అమిత్ షా వరుస ట్వీట్లు చేశారు.

"ఈ ఏడేళ్లలో, దేశ ప్రయోజనాలకు తన దృఢమైన, సంపూర్ణ, సంక్షేమ విధానాలతో శ్రీ మోదీ ప్రాధాన్యతనిస్తూ, పేదలు, రైతులు, బడుగు వర్గాల జీవన ప్రమాణాలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లడం ద్వారా మెరుగుపరిచారు. మరోవైపు, తన దృఢమైన నాయకత్వంతో భారత్‌ను శక్తిమంత దేశంగా తీర్చిదిద్దారని" తన ట్వీట్లలో అమిత్ షా పేర్కొన్నారు.

"గత ఏడేళ్లుగా దేశ ప్రజలు శ్రీ మోదీ సేవలు, అంకితభావం పట్ల స్థిరమైన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూనే ఉన్నారు, ఇందుకు నేను వారికి నమస్కరిస్తున్నాను. దూరదృష్టి గల శ్రీ మోదీ నాయకత్వంలో మేం ప్రతి సవాలును అధిగమించి, భారత ప్రగతి ప్రయాణాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని నాకు నమ్మకముంది" అని కేంద్ర హోంమంత్రి ట్విట్టర్ ద్వారా వివరించారు.

# కేంద్రం ప్రభుత్వంపై సుప్రీం అసహనం..

న్యూఢిల్లీ, మే 31: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కరోనా వ్యాక్సిన్ విధానాలపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. టీకాల కొరత, సమీకరణ, ధరలు, విధానాలపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు సంధించింది.45 ఏళ్లు పైబడిన వారికి 100 శాతం డోసులు ఇచ్చి.. 18?44 ఏళ్ల వారికి మాత్రం 50 శాతమే ఎందుకు ఇస్తున్నారని జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ ఎల్.ఎన్. రావు, జస్టిస్ ఎస్. రవీంద్ర భట్ ల త్రిసభ్య ధర్మాసనం నిలదీసింది. "45 ఏళ్లు దాటిన వారందరికీ కేంద్రమే టీకాలను సమీకరిస్తోంది. కానీ, 18 నుంచి 44 ఏళ్ల వారికి మాత్రం సగం రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసింది. వాటి ధరలనూ కేంద్రమే నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు పోను మిగతా డోసులను ప్రైవేట్ ఆసుపత్రులకు ఇవ్వవచ్చని ఆదేశాలూ ఇచ్చింది. ఏ ప్రాతిపదికన ఈ విధానాలను రూపొందించారు?" అని ప్రశ్నించింది. 45 ఏళ్లు దాటిన వారిలోనే కరోనా మరణాల ముప్పు ఎక్కువుందంటూ కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, కానీ, ఇప్పుడు సెకండ్ వేవ్ లో 45 ఏళ్ల లోపు వారే ఎక్కువ మంది చనిపోతున్నారని కోర్టు గుర్తు చేసింది. అలాంటప్పుడు కేవలం 45 ఏళ్ల పైన వారి కోసమే కేంద్రం టీకాలను ఎందుకు సమీకరిస్తోంది? అని ప్రశ్నించింది.టీకాల కోసం కొవిన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధననూ ప్రశ్నించింది. ఈ నిబంధన వల్ల ఇంటర్నెట్ అంతంతమాత్రంగానే ఉండే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ సరిగ్గా సాగదని అభిప్రాయపడింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కొవిన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం సవాలుతో కూడుకున్నదేనని పేర్కొంది. గ్రామస్థులు సమీపంలోని కంప్యూటర్ కేంద్రానికి వెళ్లి కొవిన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్న కేంద్ర ప్రభుత్వ సమాధానంపై సుప్రీం కోర్టు ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. అది నిజంగా సాధ్యమయ్యేదేనా? అని ప్రశ్నించింది. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లే వలస కూలీలకు అది సాధ్యం కాని పని అని అసహనం వ్యక్తం చేసింది.కాగా, ఈ ఏడాది చివరి నాటికి దేశంలోని ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేస్తామని సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. వ్యాక్సిన్ల సమీకరణ కోసం ఫైజర్ వంటి సంస్థలతో చర్చలు జరుపుతున్నామని, అవి సఫలీకృతమైతే ఇంకా ముందుగానే వ్యాక్సినేషన్ ను పూర్తి చేస్తామని వెల్లడించింది.

# వైఎస్ జగన్ రెండేళ్ల పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తి



తెనాలి, మే 31: :ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి 2 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం స్థానిక గంగానమ్మ పేట లోని తెనాలి వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను రెండేళ్లలో 90 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను నేరుగా అందించిన ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అని పేర్కొన్నారు. పూజ్య బాపూజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యానికి నాందిపలికిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి వైయస్ జగన్ అని కొనియాడారు. నాయకులు తిరుమల శెట్టి శ్రీనివాసరావు అక్కి దాస్ కిరణ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రెండు ఏళ్ళ పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కోవిడ్ విపత్తు సమయంలోనూ ప్రజలందరికీ అండగా నిలిచిన ప్రభుత్వం అన్నారు. విద్య వైద్యం తో పాటు వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ వైసిపి నాయకులు యేసు శ్రీనివాసరావు బూరెల దుర్గ ప్రసాద్ రఘురామిరెడ్డి మన్నవ ప్రభాకర్ కఠారి హరీష్ పలువురు కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరోనా కొరడా దెబ్బకు చితికిపోతున్న లేత భారతం

## (01 జూన్ 'అంతర్జాతీయ బాలల దినం' సందర్భంగా)

కరోనా కల్లోలం కాలం ప్రపంచ మానవాళిని మహా విపత్తులోకి నెట్టింది. కరోనా తెలియని మనిషి లేడు, భయపడని తనువు దొరకదు. అందరు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ ఘడియలు లెక్కిస్తున్నారు. లాక్‌డౌన్లు, కర్ఫ్యూలతో బయటకు రావడం లేదు. ఉద్యోగ ఉపాధులు పోయాయి. వేతనాల కోతలు అమలు అవుతున్నాయి. పేదలకు బతుకుదెరువు కరువైంది, జీవితం బరువెక్కుతోంది. జీవనోపాధులు సన్నబడ్డాయి, అర్థ ఆకలి రోజులు నడుస్తున్నాయి. బతుక్కు మరియు బతుకుదెరువుకు మధ్య పోరు జరుగుతోంది. పని చేస్తేనే ముద్ద దొరికేది, పనికి వెళితే వైరస్ భయం చంపేస్తోంది. ఉపాధి లేకపోతే ఆకలి చావులు, పనికి వెళితే కోవిడ్-19 చావులు, అడ కత్తెరలో పోక చెక్కలా నరుడు నలిగిపోతూ, నరకయాతన అనుభవిస్తున్నాడు. కుటుంబ పెద్దల నిస్సహాయ దుస్థితి పిల్లల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తున్నది. పేద కుటుంబాల్లో పిల్లలకు స్మార్ట్ ఫోన్లు అందుబాటులో లేని కారణంగా ఆన్‌లైన్ తరగతులు హరించుకు పోతున్నాయి. రెండు పూటలా పోషకాహారం అందని ద్రాక్షే అవుతున్నది. వైరస్ మహమ్మారి సంక్షోభం విశ్వవ్యాప్తమైంది. గర్భంలోని శిశువు నుంచి పండు ముసలి వరకు కరోనా దుష్ప్రభావం పడని నరులు లేరు. ప్రపంచవ్యాప్తంగా కరోనా కొరడా దెబ్బకు బాల్యం చితికి పోతున్నది. ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలు శారీరకంగా, మానసికంగా కుచించుకు పోతున్నారు. నేటి బాలల బతుకులపై కరోనా దుష్ప్రభావం జీవితాంతం వెంటాడేలా ఉన్నది. పేద దేశాల్లో బాలల పరిస్థితి దుర్భరంగా ఉన్నది. పేద కుటుంబాల ఆదాయం తగ్గడం, ఉపాధులు దొరక్క పోవడంతో బాలల బాల్యం విష వలయంలో చిక్కకకు పోతున్నది. నిరుపేదలకు సాంఘీక, ఆరోగ్య భద్రత కరువైంది.

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న కోవిడ్-19 విపత్తు ఫలితంగా ఏర్పడిన సాంఘీక ఆర్థిక సంక్షోభంతో 142 మిలియన్ల బాలలు కొత్తగా కడు పేదరికంలోకి నెట్టబడ్డి వారి సంఖ్య 750 మిలియన్లకు చేరడం విచారకరం. అభాగ్య బాలల్లో 66 శాతం సబ్-సహారా ఆఫ్రికా మరియు దక్షిణ ఆసియా దేశాలకు చెందిన వారే ఉండడం విశేషం. దాదాపు 150 మిలియన్ల బాలలు విద్య, ఆరోగ్యం, గృహ వసతులు, పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత నీరు లాంటి వసతులు లేకుండా కరోనా విజృంభనతో మరింత బక్కచిక్కి పోవడం జరుగుతున్నది. విశ్వవ్యాప్తంగా 188 దేశాలు విద్యాలయాలను మూసి వేయడంతో 1.6 బిలియన్ల పిల్లలు మరియు యువత విద్యాలయాలకు దూరమైనారు. ప్రపంచంలోని 463 మిలియన్ల పిల్లలు (ప్రతి ముగ్గురిలో ఒకరు) ఆన్‌లైన్ విద్యకు దూరమైనారని, ఈ బాలల వ్యక్తిత్వ వికాసం సరిగ్గా జరగడం లేదని తేలింది. పోషకాహార లోపంతో పిల్లల ఎదుగుదల కుంటుబడటం, పలు తీవ్ర అనారోగ్యాలు కలగడం పరిశీలించబడింది.

బాలలకు కోవిడ్-19 సోకే ప్రమాదాలు కూడా లేకపోలేదని గమనించాలి. పిల్లలకు కరోనా నిబంధనలు వివరిస్తూ, వాటిని తూచా తప్పక పాటించేలా చూడాల్సిన బాధ్యత తల్లితండ్రులు మరియు కుటుంబ పెద్దల మీద ఉన్నది. కరోనా తొలి మరియు రెండవ అలతో పిల్లలు కొంత వరకు బయట పడగలిగినారు. బాలలకు తరుచుగా వైద్య పరీక్షలు చేయించడం మరువవద్దు. కోవిడ్-19 వ్యాప్తితో పిల్లల్లో మానసిక ఒత్తిడి మరియు గాబరా పెరుగుతుంది. దీనితో బాలల్లో అలసట, చికాకు, ఏకాగ్రత లేకపోవడం, నిద్ర లేమి లాంటి సమస్యలకు లోనవుతారు. బాలలకు పోషకాహారం, ఆదరణ, సక్రమ నిద్ర, మానసిక చైతన్యం, శారీరక శ్రమ, గృహ ఆవరణలో ఆటపాటలు, స్నేహితులతో సరదాగా గడపడం, మంచి అలవాట్లను నేర్పడం, ఆరోగ్య సంరక్షణ లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. కరోనా రుద్దిన నిబంధనలతో వ్యక్తులకు, స్నేహితులకు దూరంగా ఉండడం, ఇరుగు పొరుగుతో అనుబంధాలు తగ్గడం, ఒంటరిననే భావన, బడులు/సాంఘీక కలయికలు లేకపోవడం, అమ్మనాన్నలు పనికి వెళ్ళడం, కోవిడ్-19 రోగుల వార్తలు విని చలించి పోవడం లాంటివి లేత మనసులకు గాయాలను కలిగిస్తాయి.

ఇండియాలోని బి.1.1.7 మరియు బి.1.617 వేరియంట్లు 1 నుంచి 16 ఏండ్ల పిల్లలకు మరియు కౌమార దశ యువతకు కూడా సోకవచ్చని తెలుస్తున్నది. నవజాత శిశువులకు కూడా తల్లి నుంచి కరోనా సోకడం గమనించారు. కరోనా సోకిన పిల్లల్లో కోవిడ్-19 లక్షణాలు సులభంగా కనిపించవు. ఈ బాలలు అందరితో కలిసి ఆడుతూ, పాడుతూ ఆరోగ్యంగా, సరదాగా గడపడంతో కరోనా వ్యాప్తిలో 'సూపర్ స్ప్రెడర్స్'గా కుటుంబ సభ్యులకు మరియు ఇరుగు పొరుగు ప్రజలు కరోనా బారిన పడే అవకాశాలు ఎక్కువ. టీకాలు వేయనందున పిల్లలను, యువతను పాఠశాలకు వెళ్ళమనడం సముచితమేమి కాదు. తల్లితండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి. కరోనా సోకిన పిల్లలకు 'మల్టీసిస్టమ్ సిండ్రోమ్' జబ్బు వచ్చే అవకాశం ఎక్కువ. 18 ఏండ్ల లోపు పిల్లలకు వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉండడంతో 8 శాతం మందికి మాత్రమే కరోనా సోకడానికి అవకాశం ఉంది. కోవిడ్-19 కారణంగా మరణించడం పిల్లల్లో చాలా చాలా తక్కువ. కరోనా 3వ వేవ్ ఆగష్టు, సెప్టెంబర్-2021లలో కావచ్చని, ఈ వేవ్‌కు పిల్లలు కూడా కోవిడ్-19 బారిన పడవచ్చని నిపుణుల హెచ్చరిస్తున్నారు. ఈ హెచ్చరికలను తేలికగా తీసుకోకుండా, 2వ వేవ్ గుణపాఠాన్ని గుర్తు చేసుకుంటూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసే ప్రయత్నాలను గట్టిగా చేయాలి. ఇందుకుగాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు వివిధ స్థాయిల్లో పెడియాట్రిక్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేయడం, పిల్లల ఆసుపత్రుల్లో పడకలు కేటాయించడం, వ్యాక్సినేషన్ పూర్తి చేయడం, అత్యవసర ఔషధాలు, ఉపకరణాలు సిద్ధం చేయడం, తల్లితండ్రులను చైతన్య పరచడం లాంటి పలు చర్యలను ముందుగానే తీసుకోవాలి. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులను తలచి, పిల్లల పెరుగుదలకు సహకరిస్తూ, కరోనాకు దూరంగా ఉంచుతూ, ముందుకు సాగుదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# భారతీయ నావికాదళానికి చెందిన ఎల్‌హెచ్ ఎంకె ఎఎల్ విమానంలో మెడికల్ ఐసియు ఏర్పాటు



న్యూఢిల్లీ, మే 31: ఐఎన్ఎస్ హంస వద్ద గల ఐఎఎన్ఎఎస్ 323 నుంచి ఎల్‌హెచ్ ఎంకె ఎఎల్ లో హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్) మెడికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎంఐసియు) వ్యవస్థను ఏర్పాటు చేసింది. అన్నిరకాల వాతావరణాల్లో ప్రయాణించగల ఎల్‌హెచ్ ఎంకె ఎఎల్‌లో ఎంఐసియును ఏర్పాటు చేయడం వల్ల భారతీయ నావికాదళం క్లిష్టపరిస్థితుల్లో ఉన్న రోగులను ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా వైద్య తరలింపును విమానం ద్వారా చేపట్టవచ్చు.

ఎంఐసియులో రెండు జతల డిఫిబ్రిలేటర్స్, మల్టీపారా మానిటర్లు, వెంటిలేటర్, ఆక్సిజన్ మద్దతుతో పాటుగా లోపలకి పంపగల సిరంజి పంపులు కూడా ఉన్నాయి. రోగిని విమానంలో తీసుకువెడుతున్నప్పుడు నోటిలో నుంచి వస్తున్న స్రావాలను శుభ్రం చేసేందుకు చోషణ వ్యవస్థ కూడా ఉంది. ఈ వ్యవస్థను వైమానిక విద్యుత్ సరఫరా మీద నిర్వహించవచ్చు, దానితో పాటుగా నాలుగు గంటల బ్యాటరీ బ్యాకప్ కూడా ఉంది. విమానాన్ని ఎయిర్ అంబులెన్స్‌గా మార్చేందుకు పరికరాలను రెండు మూడు గంటల్లో అమర్చవచ్చు. హెచ్ఎఎల్ నావికాదళానికి అందించనున్న ఎనిమిది ఎంఐసియు సెట్లలో ఇది మొదటిది.

# జూన్‌లో టీకాల కార్యక్రమానికి 12 కోట్ల డోసుల అందుబాటు

న్యూఢిల్లీ, మే 31: కరోనా సంక్షోభాన్ని నియంత్రించటానికి భారత ప్రభుత్వం అనుసరిస్తున్న సమగ్ర వ్యూహంలో భాగంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి సోకినవారు ఆచూకీ కనిపెట్టటం, మెరుగైన చికిత్స అందించటం, కోవిడ్ నివారణకు అవసరమైన జాగ్రత్తల్కు పాటించటంతోబాటు టీకాల కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు అండగా నిలుస్తూ టీకా మందు ఉచితంగా అందజేస్తూ వచ్చింది. మే 1 నుంచి టీకాల కార్యక్రమం వేగవంతం చేయటంలోను, ఉదారంగా ధర నిర్ణయించటంలోను, మిగిలిన 50% డోసులు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ప్రైవేట్ ఆస్పత్రులు నేరుగా కొనుక్కునే అవకాశం కల్పించటంలోను కేంద్ర ప్రభుత్వ చొరవ కనబడుతుంది.

కేంద్రప్రభుత్వం చేసే కేటాయింపులు ఆయా రాష్ట్రాల జనాభా, టీకాలు వాడుతున్న తీరు, వృధాను కనీస స్థాయిలో ఉంచటం లాంటి అంశాల ఆధారంగా జరుగుతోంది. అదే విధంగా జూన్ నెల మొత్తానికి టీకాలు ఎప్పుడెప్పుడు అందుతాయో ఒక కచ్చితమైన ముందస్తు సమాచారాన్ని కూడా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇస్తోంది. ఈ సమాచారాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ మే 17, 27, 29 తేదీలలో రాసిన లేఖలలో అందజేసింది. జూన్ నెలకు గాను 6.09 కోట్లకు పైగా (6,09,60,000) డోసులను రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇస్తూ అవి ప్రాధాన్య వర్గాలైన ఆరోగ్య సిబ్బందికి, కొవిడ్ యోధులకు 45 ఏళ్ళు పైబడ్డవారికి ఇవ్వటానికి ఉచితంగా కేటాయిస్తున్న సంగతి గుర్తు చేసింది. ఇవి కాకుండా 5.86 కోట్ల (5,86,10,000) డోసులు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ప్రైవేట్ ఆస్పత్రులు నేరుగా కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉందని స్పష్టం చేసింది. అందువలన జూన్ నెలలో మొత్తం దాదాపు 12 కోట్ల (11,95,70,000) డోసులు దేశవ్యాప్తంగా ఇవ్వటానికి అందుబాటులో ఉంటాయి. ఈ కేటాయింపులు ఎప్పుడెప్పుడు అందుతాయో వాటి వివరాలను ముందుగానే రాష్ట్రాలకు తెలియజేస్తారు. అందువలన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ అధికారులకు తగిన ఆదేశాలిచ్చి వీటిని సక్రమంగా, హేతుబద్ధంగా వాడుతూ నామమాత్రస్థాయిలో వృధా ఉండేట్టు చూడాలని కేంద్రం కోరింది.

భారత ప్రభుత్వం 15/30 రోజుల షెడ్యూల్ ముందుగా తెలియజేయటం ద్వారా కేంద్రం ఇచ్చే డోసుల సంఖ్యనుబట్టి రాష్ట్రాలు తమ కొనుగోళ్లను నిర్ణయించుకోవటం, అందుబాటు ఆధారంగా టీకాల షెడ్యూల్ స్వయంగా తయారుచేసుకోవటం సాధ్యమవుతుంది.

మే నెలకు గాను మొత్తం 4.03 కోట్ల (4,03,49,830) టీకా డోసులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఉచితంగా అందజేసింది. ఇవి కాకుండా రాష్ట్రాలు నేరుగా కొనుగోలు చేసుకోవటానికి 3.90 కోట్లకు పైగా (3,90,55,370) డోసులు అందుబాటులో ఉన్నాయి. ఆ విధంగా మే నెలలో మొత్తం 7,94,05,200 డోసులు టీకా కార్యక్రమానికి అమ్ముబాటులో ఉంచినట్టు లెక్క.

# రాజకీయాల్లోకి చిన్నమ్మ.. రీ-ఎంట్రీకి శశికళ రెడీ!

చెన్నై, మే 31: తమిళనాడు దివంగత ముఖ్య మంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. గతంలో అన్నాడీఎంకే పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఆమె.. ఆ పార్టీపై తిరిగి పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయనున్నారు. అక్రమాస్తుల కేసులో శిక్ష అనుభవించి జైలు నుంచి విడుదలైన తర్వాత శశికళ అన్నాడీఎంకే పగ్గాలు పుచ్చుకుంటారని అందరూ భావించినప్పటికీ, ఆమె అనూహ్యంగా మనసు మార్చుకున్నారు. ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నిక లకు ముందు శశికళ..అంతర్గతపోరు కారణంగా పార్టీ నాశనమైపోవడం తాను చూడలేననీ, రాజకీయాల నుంచి దూరంగా ఉంటానని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఎక్కడా కనిపించలేదు. అయితే, ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ప్రస్తుతం అన్నాడీఎంకే పార్టీ ప్రతిపక్ష స్థానానికి పరిమితమైంది.దీంతో శశికళ దృష్టి తిరిగి రాజకీయాలపై పడిందని సమాచారం. తాను మళ్లీ వచ్చేస్తానని మద్దతుదారులకు చూచాయగా చెప్పినట్టు తెలుస్తోంది. అంతర్గత కుమ్ములాటలతో పార్టీ నాశనం అవుతూ ఉంటే చూస్తూ కూర్చోలేనని, తానొచ్చి పార్టీని గాడిలో పెడతానని మద్దతుదారులతో చెప్పినట్టు సమాచారం. " ఎవరికి ఎలాంటి ఆందోళన అవసరం లేదు.. పార్టీ విషయాలను తప్పకుండా చక్కబెడతాను.. ధైర్యంగా వుండండి.. కరోనా సెకెండ్ వేవ్ ముగిసిన తర్వాత నేను మళ్ళీ వస్తాను" అంటూ శశికళదిగా చెబుతున్న ఓ ఆడియో టేపు తమిళనాట సంచలనం రేపుతోంది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.జయలలిత మరణా నంతరం 2016లో శశికళ ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి అయ్యారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టేందుకు కూడా



రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే అనూహ్యంగా అక్రమాస్తుల కేసులో 2017 ఫిబ్రవరిలో అరెస్టయి జైలుకు వెళ్లిన శశికళ, ఆమె మేనల్లుడు దినకరన్ పార్టీపై పట్టు కోల్పోయారు. అనంతరం తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆమె జైలు నుంచి విడుదల కావడంతో సర్వత్ర ఉత్కంఠ రేపింది. మళ్లీ అన్నాడీఎంకే పార్టీలో చేరుతారని పార్టీని హస్తగతం చేసుకుంటారని ప్రచారం జరిగింది. అయితే, అనేక పరిణామాల తర్వాత ఆమె రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

# కోవిడ్ మృతులైన కార్మికుల కుటుంబాలకు అండ!

న్యూఢిల్లీ, మే 31: కోవిడ్-19 వైరస్ మహమ్మారి వ్యాప్తి కారణంగా మరణాల సంఖ్య పెరగడంతో తమ కుటుంబ సభ్యుల సంక్షేమం గురించి కార్మికుల్లో ఏర్పడిన భయాందోళలను తొలగించేందుకు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రిత్వ శాఖ పలు చర్యలను తీసుకుంది. కార్మిక రాజ్యబీమా సంస్థ (ఇ.ఎస్.ఐ.సి.), ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఇ.పి.ఎఫ్.ఒ.)ల ద్వారా కార్మికులకు అదనపు ప్రయోజనాలను ప్రకటించింది. ఉద్యోగి, లేదా కార్మికుడికి ఎలాంటి అదనపు ఖర్చు లేకుండానే మరింత విస్తృత స్థాయిలో సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలను ప్రకటించారు.

ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఇ.ఎస్.ఐ.సి. కింద బీమా పొందిన వ్యక్తి తన విధి నిర్వహణలో గాయాలతో మరణించినా లేదా అంగవికలుడైనా, సదరు ఉద్యోగి సగటు దినసరి వేతనంలో 90శాతానికి సమానమైన పెన్షన్,. తన జీవిత భాగస్వామికి లేదా వితంతువైన తల్లికి జీవితాంతం అందుతుంది. పిల్లలకు అయితే వారు పాతికేళ్ల వయస్సు వచ్చేవరకూ పెన్షన్ ఇస్తారు. అదే ఆడపిల్లకైతే తన వివాహం వరకూ ఈ సదుపాయం వర్తిస్తుంది.

అయితే, ఇ.ఎస్.ఐ.సి. పథకం కింద బీమా సదుపాయం ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఉద్యోగికి కోవిడ్ వ్యాధి నిర్ధారణ కావడానికి ముందే ఇ.ఎస్.ఐ.సి. ఆన్ లైన్ పోర్టల్ లో పేర్లు నమోదైన ఉద్యోగి కుటుంబ సభ్యులందరికీ అవే ప్రయోజనాలను, అవే పద్ధతిలో వర్తింపజేయాలని కార్మిక, ఉపాధి కల్పనా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. అయితే, ఈ కింద సూచించిన అర్హతాపరమైన షరతులకు లోబడి ఈ ప్రయోజనాలను వర్తింపజేస్తారు.:

బీమా సభ్యత్వం ఉన్న వ్యక్తి తనకు కోవిడ్ నిర్ధారణ జరగడానికి కనీసం 3 నెలలు ముందుగా ఇ.ఎస్.ఐ.సి. ఆన్ లైన్ పోర్టల్.లో తన పేరును నమోదు చేసుకుని ఉండాలి.

బీమా సభ్యత్వం ఉన్న వ్యక్తి తనకు కోవిడ్ నిర్ధారణ జరిగిన సంవత్సరానికి మునుపటి ఏడాదిలో నియమితుడై ఉండి, తన వేతనంనుంచి కనీసం 78 రోజుల పాటు ఇ.ఎస్.ఐ.సి. చందా జమ అయి ఉండాలి.

ఈ అర్హతలన్నీ ఉన్న బీమా వ్యక్తులు, కోవిడ్ వ్యాధితో మరణించిన పక్షంలో సదరు వ్యక్తులపై ఆధారపడిన వారికి, బీమా వ్యక్తుల దినసరి వేతనంలో 90శాతం చొప్పున మొత్తం నెలవారీగా జీవితాంతం చెల్లిస్తారు. ఈ పథకం గత ఏడాది (2020) మార్చి 24నుంచి రెండేళ్ల పాటు అమలులో ఉంటుంది.

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలోని డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఇ.డి.ఎల్.ఐ.) పథకం కింద సభ్యుడైన వ్యక్తి మరణించిన పక్షంలో సదరు వ్యక్తిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ ఇ.డి.ఎల్.ఐ. పథకం ప్రయోజనాలు పొందేందుకు అర్హత ఉంటుంది. ప్రస్తుతం ఈ పథకం కింద గ్రాట్యుటీ చెల్లింపునకు కనీస సర్వీసు ఉండాలన్న షరతులేకుండా ఈ ప్రయోజనాలను అందిస్తున్నారు. అలాగే, ఇ.పి.ఎఫ్ అండ్ ఎం.పి. చట్టం నిబంధనల కింద కుటుంబ పెన్షన్ చెల్లిస్తున్నారు. కార్మికులు అస్వస్థులై విధులకు హాజరు కాలేని పక్షంలో సదరు కార్మికులుకు తమ వేతనంలో 70శాతం మొత్తాన్ని సిక్.నెస్ బెనిఫిట్ గా 91 రోజులపాటు చెల్లిస్తూ వస్తున్నారు.

మరణించిన ఉద్యోగికి సంబంధించిన కుటుంబ సభ్యులకు చెల్లించే గరిష్ట మొత్తాన్ని ఆరు లక్షలనుంచి 7 లక్షలకు పెంచారు.

ఒక సంస్థలో గానీ, అంతకు మించి పలు సంస్థల్లో గానీ ఎవరైనా ఉద్యోగి తాను మరణించిన సంవత్సరానికి పూర్వం 12 నెలలపాటు సభ్యుడై ఉండిన పక్షంలో అర్హులైన కుటుంబ సభ్యులకు రూ. 2.5లక్షల కనీస హామీ ప్రయోజనం లభిస్తుంది. ఇంతకు ముందు అమలులో ఉన్న నిబంధన ప్రకారమైతే ఒకే సంస్థలో సుదీర్ఘంగా 12ఏళ్లపాటు ఉద్యోగి అయి ఉండాలన్న షరతు ఉండేది. అయితే, సవరించిన ఈ నిబంధనతో తరచుగా ఉద్యోగాలు మారవలసిన పరిస్థితుల్లో ఉండే కాంట్రాక్ట్ ఉద్యోగులకు, కాజువల్ ఉద్యోగులకు ప్రయోజనం లభిస్తుంది.

కనీస హామీ ప్రయోజన రూపంలో చెల్లించే రూ. 2.3లక్షల పరిహారానికి సంబంధించిన నిబంధనను,..గత ఏడాది (2020) ఫిబ్రవరి 15నుంచి అమలులోకి వచ్చేలా పునరుద్ధరించారు.

రాబోయే మూడేళ్లలో, అంటే 2021-22వ సంవత్సరంనుంచి 2023-24వ సంవత్సరం వరకూ అర్హులైన కుటుంబ సభ్యులు ఇ.డి.ఎల్.ఐ. నిధినుంచి రూ. 2,185కోట్లను అదనపు ప్రయోజనంగా పొందే అవకాశాలున్నాయని లెక్కలు చెబుతున్నాయి.

ఉద్యోగుల మరణాల కారణంగా నష్టపరిహారం, ప్రయోజనాల కోసం దాఖలు చేసుకునే క్లెయిముల సంఖ్య సంవత్సరానికి 50,000కు పైగానే ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. కోవిడ్.తో అస్వస్థత కారణంగా దాదాపు పదివేలదాకా మరణాలు ఉండవచ్చన్న అంచనాల నేపథ్యంలో ఈ లెక్కలు వేస్తున్నారు.

కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనా మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ సంక్షేమ చర్యలతో కోవిడ్ కారణంగా మరణించిన కార్మికుల కుటుంబాలకు తగిన సహాయం లభిస్తుంది. మహమ్మారి వైరస్ వ్యాప్తితో తీవ్రమైన సవాళ్లను, కష్టాలను ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఇది ఎంతో రక్షణ కల్పిస్తుంది.

# ఒకశాతం మంది మాత్రమే లాక్‌డౌన్ ఉల్లంఘిస్తున్నారు: సీపీ

హైదరాబాద్ , మే 31: హైదరాబాద్‌లో గడిచిన 17 రోజులుగా లాక్‌డౌన్ పకడ్బందీగా అమలవుతోందని నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. పాతబస్తీలో లాక్‌డౌన్ అమలును ఆయనతో పాటు అడిషనల్ సీపీ చౌహాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ? 99 శాతం మంది ప్రజలు పోలీసులకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. కేవలం 1% ప్రజలే అనవసరంగా బయటకు వస్తున్నారని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి కేసులు పెడుతున్నట్లు తెలిపారు.

మరోవైపు ప్రతిరోజూ హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 9వేల లాక్‌డౌన్ ఉల్లంఘన కేసులు నమోదవుతున్నాయని, ఆరువేల వాహనాలు సీజ్ అవుతున్నట్లు సీపీ వెల్లడించారు. నగరంలో 180 చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పాటు పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని సీపీ తెలిపారు.

# ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యం

## - ఎమ్మెల్యే అన్నా బత్తుని శివ కుమార్

తెనాలి, మే 31: అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళుగా భావిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి రాష్ట్రంలో సువర్ణ పాలన అందిస్తున్నారని శాసనసభ్యుడు అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి రెండేళ్లు అయిన సందర్భంగా స్థానిక రణరంగ చౌక్ సమీపంలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైయస్ జగన్ రాష్ట్రంలో సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందించారన్నారు. లబ్ధిదారులకు నేరుగా 86 వేల కోట్ల రూపాయలను జమ చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా పాలన అందిస్తున్న గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి వైయస్ జగన్ అని కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేలా ప్రజలందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శివకుమార్ విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీం, వైస్ చైర్మన్ మాలేపాటి హరి ప్రసాద్ వైసిపి నాయకులు దేసు శ్రీనివాసరావు, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్ ,కిరణ్ కుమార్, తిరుమల శెట్టి శ్రీనివాసరావు, మన్నవ ప్రభాకర్,కాళిదాసు వెంకటేశ్వరరావు, జాకీర్ హుస్సేన్,గౌస్, కౌన్సిలర్లు సంజీవరెడ్డి,దుబాయ్ బాబు, ఇస్మాయిల్, విజయలక్ష్మి పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# పవర్‌గ్రిడ్ సాయంతో డయ్యుకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన కేంద్ర విద్యుత్ శాఖ

న్యూఢిల్లీ, మే 31: తౌక్టే తుపాను కారణంగా భారీగా ధ్వంసమైన టింబ్డీ–ధోకద్వ, సావర్‌కుండ్ల–ధోకద్వ 220 కేవీ విద్యుత్ సరఫరా లైన్లను కేంద్ర విద్యుత్ శాఖ పునరుద్ధరించింది. మహారత్న హోదా కలిగిన, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (పవర్‌గ్రిడ్) సాయంతో లైన్లకు మరమ్మతులు చేసింది. ఈ లైన్లు డయ్యుకు విద్యుత్‌ను సరఫరా చేస్తాయి.

తౌక్టే తుపాకును కారణంగా ఈ విద్యుత్ మార్గంలో 33 టవర్లు కూలిపోయాయి. దాదాపు 600 మంది సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడి మరమ్మతులు పూర్తి చేశారు. 'అత్యవసర పునరుద్ధరణ వ్యవస్థ'ను ఉపయోగించిన పవర్‌గ్రిడ్, టింబ్డీ–ధోకద్వ మధ్య 11 టవర్లను బాగు చేయడంతోపాటు 10 కొత్త టవర్లను ఈ నెల 28న నిర్మించింది.

ఈ లైను పునరుద్ధరణతో, గెట్కోకు చెందిన పదిహేను 66కేవీ ఉప కేంద్రాలకు విద్యుత్ అందింది. తద్వారా డయ్యు, చుట్టుపక్కల ప్రాంతాలకు విద్యుత్ సరఫరా జరిగింది. సవర్‌కుండ్ల–ధోకద్వ మధ్య విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.

# మరోసారి పెరిగిన చమురు ధరలు..

న్యూఢిల్లీ, మే 31: దేశవ్యాప్తంగా ఇంధన ధరలు మరోసారి పెరిగాయి. సోమవారం లీటర్ పెట్రోల్‌పై 29 పైసలు, డీజిల్‌పై 28 పైసలు పెరుగుదల నమోదైంది. వాణిజ్య రాజధాని ముంబైలో లీటరు పెట్రోల్ ధర రూ.100 వద్ద కొనసాగుతోంది. అక్కడ లీటరు పెట్రోల్ ప్రస్తుతం రూ.100.47, డీజిల్ ధర లీటరుకు రూ. 92.25 పెరిగినట్లు ప్రభుత్వ ఇంధన రిటైలర్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పేర్కొంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ రేటు లీటరుకు రూ.94.23, డీజిల్ రూ.85.15. దేశంలో మే 3 నుంచి ఇంధన ధరలు.. పెట్రోల్ లీటరు ధర రూ. 3.83, డీజిల్ రేటు రూ.4.42 పెరగటం గమనార్హం.

# రేపట్నుంచి బ్యాంకుల పని వేళల్లో మార్పు



హైదరాబాద్ , మే 31: తెలంగాణలో లాక్‌డౌన్ సడలింపుల నేపథ్యంలో బ్యాంకుల పని వేళల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశమై బ్యాంకుల పని వేళలపై సమీక్షించింది. లాక్‌డౌన్ సమయం సడలింపుతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్యాంకుల సేవలు అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. మారిన బ్యాంకు వేళలు జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మార్గదర్శకాలు జూన్ 9 వరకు అమల్లో ఉండనున్నాయి.

# ఆకేరువాగుపై బ్రిడ్జి, రోడ్డు నిర్మాణానికి రూ.10.43 కోట్లు

వర్ధన్నపేట, మే 31: : ఆకేరువాగుపై బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం రూ.10.43 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఆదివారం ఐబీ అధికారులతో కలిసి రాయపర్తి మండలం కొత్తూరు నుంచి వర్ధన్నపేట మండలం ల్యాబర్తి, పర్వతగిరి మండలం రోళ్లకల్లు, కల్లెడ గ్రామాల వరకు పర్యటించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ రాయపర్తి నుంచి వర్ధన్నపేట మండలంలోని గ్రామాల మీదుగా పర్వతగిరి మండలంలోని గ్రామాలకు వెళ్లేలా పీఎంజీఎస్‌వై నుంచి 5.23 కిలోమీటర్ల రోడ్డు నిర్మించాల్సి ఉందన్నారు. ఆకేరువాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10.43 కోట్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ఇందులో రోడ్డు నిర్మాణం కోసం రూ.4.47 కోట్లు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.5.96 కోట్లు కేటాయించారని టెండర్ ప్రక్రియ కూడా పూర్తయినట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణంతోపాటు ఆకేరు వాగుపై వంతెన పూర్తయితే మూడు మండలాలకు చెందిన రైతులు, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు నిర్మించాలని రాయపర్తి, వర్ధన్నపేట మండలాలతో పాటు పర్వతగిరి మండలానికి చెందిన ప్రజలు, రైతులు కోరుతున్నారని దయాకర్‌రావు అన్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగుపడడంతోపాటు వ్యాపారులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఐబీ ఏఈ సాత్విక్, కిరణ్‌కు ఆయన నిర్మాణ పనులను వివరించారు. త్వరలోనే పనులను ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు వివరించారు. కాగా, మూడు మండలాలకు చెంది న రైతులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించిన మంత్రి దయాకర్‌రావుకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతి సీఎం కేసీఆర్



ఖమ్మం, మే 29: సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని, పేదింటి ఆడబిడ్డల పెళ్లి కోసం రూ.లక్ష అందిస్తూ వారిని మరింతగా ఆదుకుంటున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని లోతువాగు రైతువేదికలో శనివారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి, రేగళ్ల, గట్టుమళ్ల, మైలారం, బంగారు చెలక, అనిశెట్టిపల్లి, సీతారాంపురం, కారుకొండ ఉమ్మడి పంచాయతీల్లో 63 మంది లబ్ధిదారులకు సుమారు రూ.63,07,308 విలువైన చెక్కులను అందించారు. టీఆర్ఎస్ నాయకుడు వనమా రాఘవేందర్‌రావు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, ఎంపీపీ భూక్యా సోనా, తహసీల్దార్ నాగరాజు, ఎంపీటీసీ కొల్లు పద్మ, తరాల రామ్మూర్తి, కో ఆప్షన్ సభ్యుడు జక్కుల సుందర్, సొసైటీ వైస్ చైర్మన్ కూచిపూడి జగన్, డైరెక్టర్లు శేషాద్రి వినోద్, బాలకృష్ణ, సర్పంచ్‌లు బలరాం, బానోత్ శారద, కిషన్, లాలు, చంద్రశేఖర్, వెంటేశ్వర్లు, ప్రశాంత్, దిశా కమిటీ సభ్యుడు పరంజ్యోతిరావు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, కాసుల వెంకట్, పూనం శ్రీను, వశ్యా నాయక్, రాంకోటి, రాంజీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# మోదీ ప్రభుత్వ పాలనకు ఏడు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జమ్మూ కాశ్మీర్ లో ఏడు పంచాయతీల్లో కోవిడ్ 'సేవా' కార్యక్రమాలు

న్యూఢిల్లీ, మే 31: కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వ పాలనకు ఏడు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ రోజు జమ్మూ కాశ్మీర్ లోని ఏడు పంచాయతీల్లో కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ అధ్యక్షతన కోవిడ్ 'సేవా' కార్యక్రమాలు జరిగాయి.

వివిధ జిల్లాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో డీడీసీ అధ్యక్షుడు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. వందలాది మంది ప్రజలకు రేషన్ సరకులు, శానిటైజర్లు, పేస్ మాస్కులను, ఆక్సిమీటర్లు మరియు ఇతర సహాయ సామాగ్రిని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశాల్లో ప్రసంగించిన డాక్టర్ జితేంద్ర సింగ్ ఏడు సంవత్సరాల ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ పాలనలో సంక్షేమ ఫలాలు సమాజంలో అట్టడుగు వర్గాలకు చేరుతున్నాయని అన్నారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని శ్రీ నరేంద్రమోడీ అనేక విప్లవాత్మక నిర్ణయాలను తీసుకుని అమలు చేసారని మంత్రి అన్నారు. ' అంత్యోదయ' స్ఫూర్తితో ప్రభుత్వ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని అన్నారు. 2014 మేలో ప్రధానమంత్రిగా శ్రీ నరేంద్రమోడీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి దేశంలో నూతన శకం ప్రారంభం అయ్యిందని డాక్టర్ జితేంద్రసింగ్ అన్నారు. నిరాశావాదంలో ఉన్న దేశం ఆశావాద దృక్పథంతో శ్రీ నరేంద్రమోడీ నాయకత్వంలో అభివృద్ధిపథంలో పయనిస్తున్నదని మంత్రి అన్నారు.

కరోనా నేపథ్యంలో వర్చువల్ విధానంలో జరిగిన కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు సంకుచిత విధానాలు స్వార్ధ ప్రయోజనాలను పక్కనపెట్టి కరోనా నివారణకు జరుగుతున్న పోరాటానికి సహకరించాలని డాక్టర్ జితేంద్రసింగ్ కోరారు. 135 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో సంఘటిత కృషితో ఫలితాలను సాధించవచ్చునని అన్నారు. శతాబ్దంలో ఒకసారి ఇటువంటి సంక్షోభం ఎదురవుతుందని మంత్రి అన్నారు. విపత్కర పరిస్థితిని సమర్ధంగా ఎదుర్కొంటున్న సమయంలో స్వార్ధ విమర్శలకు దిగడం మంచిదికాదని అన్న మంత్రి సంఘటిత కృషితో కోవిడ్‌కు వ్యతిరేకంగా భారత్ విజయం సాధిస్తుందని అన్నారు.

ఆర్ధిక వ్యవస్థపై కోవిడ్ ప్రభావాన్ని చూపిందని డాక్టర్ జితేంద్రసింగ్ అన్నారు. అయితే, ఇబ్బందులు ఎదురైనప్పటికీ జాతీయ రహదారులు, పిఎమ్‌జిఎస్‌వై రోడ్లు, దేవిక, మన్సార్ ప్రాజెక్టులు వంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

ఇతర కేంద్రపాలిత ప్రాంతాలతో పోల్చి చూసినప్పుడు తన పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఆరు జిల్లాల్లో కోవిడ్ అదుపులో ఉండడం పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతాల్లో ఆక్సిజన్ ప్లాంటులు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సౌకర్యం ఉన్న పడకలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు.

అవసరమైన సమయంలో సొంత నిధుల నుంచి కోవిడ్ సహాయ సామాగ్రిని, ఆక్సిజన్ ప్లాంటులను ఏర్పాటు చేయడానికి నిధులను విడుదలచేసిన మంత్రికి సమావేశంలో పాల్గొన్న డీడీసీ అధ్యక్షులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో నియోజకవర్గంలో సౌకర్యాలను కల్పించడానికి ఎంపీ నిధుల నుంచి 2.5కోట్ల రూపాయలను కేటాయించిన మంత్రి వారు కృతజ్ఞతలు తెలిపారు.తన నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మంత్రి అయిదు ట్రక్కుల్లో సహాయ సామాగ్రిని పంపారు.

కోవిడ్ మహమ్మారి సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలను మెరుగుపరచడానికి 'టెలి–కన్సల్టేషన్' అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని డాక్టర్ జితేంద్రసింగ్ తెలిపారు. ఈ సౌకర్యంతో ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గుతుందని అన్నారు.

కేంద్రపాలిత ప్రాంతంలో 45 సంవత్సరాలు పైబడిన వారిలో 67 నుంచి 70 శాతం మందికి టీకాలు ఇవ్వడం జరిగిందని డాక్టర్ జితేంద్రసింగ్ తెలిపారు. ఇది జాతీయ సగటు కంటె ఎక్కువగా ఉందని మంత్రి అన్నారు. టీకాలు తీసుకోవడానికి ప్రజలు అపోహలను విడనాడి ముందుకు వస్తున్నారని చెప్పడానికి ఇది నిదర్శనమని మంత్రి అన్నారు.

# ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు ఇప్పటివరకూ 21392 మెట్రిక్ టన్నుల ఎల్ఎంఓను దేశానికి అందించాయి

న్యూఢిల్లీ, మే 31: మహారాష్ట్రకు 614 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్, ఉత్తర ప్రదేశ్‌కు దాదాపు 3797 మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్‌కు 656 మెట్రిక్ టన్నులు, ఢిల్లీకు 5476 మెట్రిక్ టన్నులు, హర్యానాకు 2023 మెట్రిక్ టన్నులు, రాజస్థాన్‌కు 98 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 2115 మెట్రిక్ టన్నులు, ఉత్తరాఖండ్‌కు 320 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 1808 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 1738 మెట్రిక్ టన్నులు, పంజాబ్‌కు 225 మెట్రిక్ టన్నులు, కేరళకు 380 మెట్రిక్ టన్నులు, తెలంగాణకు 1858 టన్నులు, జార్ఖండ్‌కు 38 మెట్రిక్ టన్నులు, అస్సాంకు 240 మెట్రిక్ టన్నులు సరఫరా చేయబడింది.

అన్ని అడ్డంకులను అధిగమించి, కొత్త పరిష్కారాలను కనుగొనే భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎంఓ) ను పంపిణీ చేయడం ద్వారా ఉపశమనం కలిగించే ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు, భారత రైల్వే 1274 ట్యాంకర్లలో 21392 మెట్రిక్ టన్నుల ఎల్ఎంఓను దేశంలోని వివిధ రాష్ట్రాలకు పంపిణీ చేసింది.

313 ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు ఇప్పటి వరకు తమ ప్రయాణాన్ని పూర్తి చేసి వివిధ రాష్ట్రాలకు ఉపశమనం కలిగించాయని గమనించవచ్చు.ఈ విడుదల సమయం వరకు 5 లోడ్ చేసిన ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు 23 ట్యాంకర్లలో 406 మెట్రిక్ టన్నుల ఎల్ఎమ్ఓతో నడుస్తున్నాయి.

హర్యానా మరియు కర్ణాటకకు లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎంఓ) డెలివరీ ఒక్కొక్కటి 2000 మెట్రిక్ టన్నులు దాటింది.

తమిళనాడు, తెలంగాణ రాష్ట్రానికి లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎంఓ) డెలివరీ ఒక్కొక్కటి 1800 మెట్రిక్ టన్నులు దాటింది.

ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు తమ డెలివరీలను 36 రోజుల క్రితం ఏప్రిల్ 24 న మహారాష్ట్రలో 126 మెట్రిక్ టన్నుల లోడ్‌తో ప్రారంభించాయి.

అభ్యర్థించే రాష్ట్రాలకు సాధ్యమైనంత తక్కువ సమయంలో సాధ్యమైనంత ఎల్ఎంఓను అందించడానికి భారత రైల్వే ప్రయత్నిస్తోంది.

ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉత్తరాఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, హర్యానా, తెలంగాణ, పంజాబ్, కేరళ, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ మరియు అస్సాం రాష్ట్రాలకు ఆక్సిజన్ ఉపశమనం అందింది.

ఈ విడుదల సమయం వరకు మహారాష్ట్రకు 614 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్, ఉత్తర ప్రదేశ్‌కు దాదాపు 3797 మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్‌కు 656 మెట్రిక్ టన్నులు, ఢిల్లీకు 5476 మెట్రిక్ టన్నులు, హర్యానాకు 2023 మెట్రిక్ టన్నులు, రాజస్థాన్‌కు 98 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 2115 మెట్రిక్ టన్నులు, ఉత్తరాఖండ్‌కు 320 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 1808 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 1738 మెట్రిక్ టన్నులు, పంజాబ్‌కు 225 మెట్రిక్ టన్నులు, కేరళకు 380 మెట్రిక్ టన్నులు, తెలంగాణకు 1858 టన్నులు, జార్ఖండ్‌కు 38 మెట్రిక్ టన్నులు, అస్సాంకు 240 మెట్రిక్ టన్నులు సరఫరా చేయబడింది.

ఇప్పటివరకు దేశంలోని 15 రాష్ట్రాల్లోని 39 నగరాలు / పట్టణాలకు ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు సేవలు అందించాయి. ఇవి లక్నో, వారణాసి, కాన్పూర్, బరేలీ, ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఆగ్రా, సాగర్, జబల్పూర్, కాట్ని ఉ మధ్యప్రదేశ్‌లోని భోపాల్, నాగ్‌పూర్, నాసిక్, కేరళలోని ఎర్నాకుళం, తిరువల్లూరు, చెన్నై, టుటికోరిన్, తమిళనాడులోని కోయంబత్తూరు, మదురై, పంజాబ్‌లోని భటిండా ఉ ఫిలౌర్, అస్సాంలోని కమ్రూప్ మరియు జార్ఖండ్‌లోని రాంచీలు ఉన్నాయి.

భారతీయ రైల్వేలు ఆక్సిజన్ సరఫరా స్థానాలతో వేర్వేరు మార్గాలను మ్యాప్ చేశాయి మరియు రాష్ట్రాల యొక్క ఏవైనా అభివృద్ధి అవసరాలకు సిద్ధంగా ఉన్నాయి. ఎల్ఎంఓను తీసుకురావడానికి రాష్ట్రాలు భారత రైల్వేకు ట్యాంకర్లను అందిస్తాయి.

భారత రైల్వే పశ్చిమంలోని హపా, బరోడా, ముంద్రా మరియు తూర్పున రూర్కెలా, దుర్గాపూర్, టాటానగర్, అంగుల్ వంటి ప్రదేశాల నుండి ఆక్సిజన్ తీసుకొని దానిని ఉత్తరాఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, హర్యానా, తెలంగాణ, పంజాబ్, కేరళ, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, అస్సాం వంటి రాష్ట్రాలకు సంక్లిష్ట కార్యాచరణ మార్గ ప్రణాళికతో అందిస్తున్నాయి.

ఆక్సిజన్‌ను సాధ్యమైనంత వేగంగా చేరుకునేలా చూసేందుకు, ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ ఫ్రైట్ రైళ్లను నడపడంలో రైల్వే కొత్త ప్రమాణాలను మరియు అపూర్వమైన బెంచ్‌మార్క్‌లను సృష్టిస్తోంది.

ఈ క్లిష్టమైన సరుకు రవాణా రైళ్ల సగటు వేగం చాలా సందర్భాలలో 55 కన్నా ఎక్కువ. అధిక ప్రాధాన్యత కలిగిన గ్రీన్ కారిడార్‌లో, అత్యవసర భావనతో, వివిధ మండలాల కార్యాచరణ బృందాలు చాలా సవాలు పరిస్థితులలో రోజంతా పనిచేస్తున్నాయి. తద్వారా ఆక్సిజన్ వేగంగా సాధ్యమయ్యే సమయ వ్యవధిలో చేరుకుంటుంది. వివిధ విభాగాలపై సిబ్బంది మార్పుల కోసం సాంకేతిక స్టాప్‌ను 1 నిమిషానికి తగ్గించారు.

ట్రాక్‌లు తెరిచి ఉంచబడతాయి మరియు ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ జివ్ చేయకుండా ఉండేలా అధిక అప్రమత్తతను నిర్వహిస్తుంది.

ఇతర సరుకు రవాణా వేగం కూడా తగ్గని రీతిలో ఇవన్నీ జరుగుతున్నాయి.

ఆక్సిజన్‌ను సరఫరా చేయడం చాలా డైనమిక్ వ్యాయామం మరియు గణాంకాలు ఎప్పటికప్పుడు నవీకరించబడతాయి. మరింత లోడ్ చేయబడిన ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు రాత్రి తరువాత వాటి ప్రయాణాలను ప్రారంభిస్తాయని భావిస్తున్నారు.

# విశాఖపట్నంలో ఆర్ .ఐ.ఎన్.ఎల్ జంబో కోవిడ్ కేర్ ఫెసిలిటీని జాతికి అంకితం చేసిన శ్రీ ధర్మేంద్రప్రధాన్

న్యూఢిల్లీ, మే 31: విశాఖపట్నం ఆర్.ఐ.ఎన్.ఎల్ స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్‌లో , ఆక్సిజన్ సరఫరా సదుపాయం కలిగిన 300 పడకల జంబో కోవిడ్ కేర్ కేంద్రాన్ని కేంద్ర పెట్రోలు, సహజవాయు , స్టీలు శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ జాతికి అంకితం చేశారు.ఈ సందర్భంగా జరిగిన వర్చువల్ సమావేశంలో ఉక్కు శాఖ సహాయమంత్రి శ్రీ ఫగన్ సింగ్ కులస్తే, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ ఎ. కాళీకృష్ణ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ పరిశ్రలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీ ఎం. గౌతమ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పంచాయతి రాజ్ , గ్రామీణాభివృద్ధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి శ్రీ పి.రామచంద్రారెడ్డి, పార్లమెంటు సభ్యులు, ఎం.ఎల్.ఎలు , భారత ప్రభుత్వ ఉక్కు శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వ అధికారులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు, ఆర్ ఐ ఎన్.ఎల్ అధికారులు ఇందులో పాల్గొన్నారు.

ఆర్ ఐఎన్ ఎల్‌వద్ద కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటు, సహకార ఫెడరలిజానికి గొప్ప ఉదాహరణ అని శ్రీ ప్ర ధాన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సంక్షేమం, వారి బాగోగులు ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఇందుకు రాష్ట్రప్రభుత్వం , జిల్లా పాలనా యంత్రాంగం మద్దతునిచ్చిందని, దీనితో ప్రధానమంత్రి దార్శనికత అయిన జహన్ బీమార్, వహీన్ ఉపచార్ అన్నది సత్వరం పి.ఎస్.యు అమలు చేయడానికి వీలైందన్నారు. ప్రధానమంత్రి పిలుపుమేరకు మేం స్టీలు ప్లాంట్లకు దగ్గరలోనే ఆక్సిజన్ సరఫరాతో కూడన జంబో కేర్ సెంటర్ల ఏర్పాటుకు స్టీలు కంపెనీలను సన్నద్ధం చేశాం అని ఆయన అన్నారు.

మనం కోవిడ్ రెండోవేవ్ మధ్యలో ఉన్నామని శ్రీ ప్రధాన్ అన్నారు. చాలావరకు మనం ఆక్సిజన్ ,రెమిడిసివర్, ఇతర మందుల అందుబాటుకు సంబంధించిన సవాలు నుంచి బయటపడ్డాం. ఇప్పుడు మరోసవాలు మనదేశంలో భారీ సంఖ్యలోని ప్రజలకు వాక్సిన్ వేయడం. మన దేశీయ ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తి సామర్ధ్యాన్ని భారీగా పెంచుతున్నారు. అంతర్జాతీయ వాక్సిన్ ఉత్పత్తిదారులతో చర్చలు కొనసాగుతున్నాయి. జూన్ తర్వాతి నుంచి వాక్సిన్ సరఫరా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఆర్ఐఎన్ఎల్ చుట్టుపక్కల ప్రజలకు వాక్సిన్ వేసేందుకు రాష్ట్రప్రభుత్వం సహకారంతో మరింత వాక్సిన్‌ను కొనుగోలు చేయాల్సిందిగా ఆర్ ఐ ఎన్ ఎల్‌ను కోరుతున్నాను అని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు

కోవిడ్ మహమ్మారి సమయంలో స్టీలు ఉత్పత్తి ప్లాంట్లు ప్రజలకు అండగా ఉన్నందుకు కేంద్ర మంత్రి , స్టీలు ప్లాంట్లను అభినందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు ద్రవరూప ఆక్సిజన్ ను అందించేందుకు దేశ ప్రజలకు అండగా విధినిర్వహణలో ఆర్.ఐ.ఎన్.ఎల్ కూడా విశేష కృషి చేసిందని ఆయన కొనియాడారు. ఆర్.ఐ.ఎన్.ఎల్ నుంచి తొలి ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 23న 100 టన్నుల ఎల్.ఎం.ఓతో మహారాష్ట్రకు చేరుకున్నదని ఆయన అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆర్.ఐ.ఎన్.ఎల్ 6,500 టన్నుల ఎల్.ఎం.ఓను సరఫరా చేసిందని, మొత్తంగా 15,000 మెట్రిక్ టన్నుల ఎల్.ఎం.ఓను ఆర్ ఐఎన్ఎల్ సరఫరా చేసిందని ఆయన చెప్పారు. ఇది ఊహించని మహమ్మారి సమయంలో ఇదొక గొప్ప సేవగా ఆయన అభివర్ణించారు.

ప్రస్తుతం ఏర్పాటు చేసిన 300 పడకల ఆస్పత్రి కేవలం ప్రారంభం మాత్రే నని ఆయన అన్నారు. ఈ కోవిడ్ కేర్ సెంటర్ , ఈ ప్రాంతంలో కోవిడ్ –19 మహమ్మారి సమయంలో అత్యంత అవసరమైన ఆరోగ్య మౌలిక సదుపాయాలకు ఊతం ఇచ్చిందని చెప్పారు. కొత్త బిఒఒ ప్లాంటు కార్యకలాపాలను ప్రారంభించేందుకు కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన చెప్పారు. దీనితో త్వరలోనే 100 మెట్రిక్ టన్నుల ద్రవరూప ఆక్సిజన్‌ను అదనంగా ఉత్పత్తి చేయడానికి వీలు కలుగుతుందని అన్నారు. రెండవదశలో కోవిడ్ కేర్ సెంటర్ సామర్థ్యాన్ని 1000 పడకల కేంద్రంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు.

ప్రస్తుతం , 100 పడకలను ట్రైనీ హాస్టల్ –1లో ఏర్పాటు చేయగా మరో 200 పడకలను గురజాడ కళాక్షేత్రంలో ఏర్పాటు చేశారు. ఇవన్నీ అంతర్గతంగా రూపొందించారు. గురజాడ కళాక్షేత్రంలోని అన్ని పడకలకు ఆక్సిజన్ సరఫరా కు వీలుగా సెంట్రల్ ఆక్సిన్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ సరఫరాకు సిలిండర్ బ్యాంక్ కూడా ఉంది. దీనిని సంస్థలోని ఉద్యోగులే డిజైన్ చేసి ఏర్పాటు చేశారు.

# కొవిడ్ బాధితులను కాపాడుకుంటాం..

## –మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ మే 31: : ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, కరోనా బాధితులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన కొడకండ్ల మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో మూడు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను ప్రారంభించారు. ఎర్రబెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో కరోనా బాధితుల కోసం నిత్యావసర సరుకులు, పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కరోనా బాధితులకు ప్రజాప్రతినిధులు అండగా నిలువాలని కోరారు. ప్రైవేటు దవాఖానల కంటే ప్రభుత్వ వైద్యశాలల్లో వసతులు మెరుగ్గా ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు అవార్డు కైవసం చేసుకొని, కేంద్రం నుంచి రూ.25లక్షల గ్రాంటు పొందిందన్నారు. ఇందుకు కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. కొడకండ్ల మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల వైద్యశాలగా మార్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఆరోగ్య కేంద్రానికి అవసరమైనన్ని ఆక్సిజన్ సిలిండర్లు పంపిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం కరోనా కట్టడిలో విఫలమైందన్నారు.మన దేశంలో తయారైన వ్యాక్సిన్ల ఇతర దేశాలకు ఎగుమతి చేయడం దురదృష్టకరమన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేవని, రైతులకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. కొందరు కుట్రపూరితంగా రైతులమని చెప్పి ధాన్యం కాలబెట్టడం సరికాదన్నారు. బీజేపీ నేతలు మాయమాటలతో రైతులను మభ్యపెడుతున్నారని, వారిని నమ్మొద్దన్నారు. ఎంతనష్టం జరిగినా కేసీఆర్ ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందని, చివరి ధాన్యపు గింజవరకూ ప్రభుత్వమే కొంటుందని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలోని మండల వైద్యాధికారి డా. భాస్కర్, సిబ్బంది, కరోనా బాధితులకు సేవలందిస్తున్న ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్డీవో పీడీ రాంరెడ్డి, డీఎంహెచ్‌వో మహేందర్, డీపీవో రంగాచారి, ఏఎంసీ చైర్మన్ పేరం రాము, ఎంపీపీ జ్యోతీరవీంద్రగాంధీనాయక్, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు రామోజీ, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, సర్పంచ్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పువ్వాడకు సీఎం ప్రశంస

ఖమ్మం, మే 31: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను సీఎం కేసీఆర్ ప్రశంసించారు. ఆదివారం ప్రగతిభవన్‌లో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో లాక్‌డౌన్ విషయం గురించి మంత్రి అజయ్‌ను సీఎం కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆర్టీసీ ఉద్యోగులకు వ్యాక్సినేషన్ కేటాయింపు, భద్రాద్రి జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు నిర్ణయం వంటి విషయాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. పజా అవసరాల కోసం క్లిష్ట సమయంలో కష్టపడి పని చేస్తున్నారంటూ అజయ్‌కి సీఎం కితాబిచ్చారు. తన కేబినెట్‌లో సమర్థవంతమైన మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారంటూ అభినందనలు తెలిపారు. కరోనా కష్ట సమయంలో వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇంజెక్షన్ల పేరిట దోపిడీలకు పాల్పడుతున్న వ్యక్తులపై ఉక్కుపాదం మోపామని, జిల్లాలో ఆక్సిజన్ కొరత ఏర్పడకుండా ఐటీసీతో చర్చించి ప్రతిరోజూ 5 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ప్రతిరోజూ 1100 రెమిడిసివిర్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచడం, ముందుచూపుతో చిన్న పిల్లల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం వంటి అంశాలపై మంత్రి పువ్వాడపై సీఎం కేసీఆర్ ప్రశంసలు జల్లు కురిపించారు. అలాగే ఆర్టీసీని సరిహద్దుల వరకు ఖమ్మం జిల్లాలోని మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో వైద్యారోగ్యశాఖ అప్రమత్తం చేయాలని కేబినెట్‌లో నిర్ణయించారు.

250 కాన్సన్‌ట్రేటర్ల వితరణ

ఇండియన్ ఫ్రెండ్స్ ఆఫ్ అట్లాంటా, పువ్వాడ ఫౌండేషన్ సంయుక్తంగా సమకూర్చిన రూ.2.5 కోట్ల విలువైన 250 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను మంత్రి అజయ్‌కుమార్ ఆదివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందించారు. వాటిని అవసరమైన ఆసుపత్రులకు అందజేయాలని సీఎం ఆదేశించారు. ఈ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పేదల కోసం వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. అమెరికా నుంచి ఈ కొత్త కాన్సన్‌ట్రేటర్లను దిగుమతి చేసేందుకు సునీల్ చావలి సహకరించినట్లు మంత్రి తెలిపారు.

# రిక్షా కార్మికులకు ఎమ్మెల్యే సండ్ర చేయూత

సత్తుపల్లి, మే 31: : కరోనా కాలంలో పనులు దొరకక అవస్థలు పడుతున్న రిక్షా కార్మికుల దీనావస్థను చూసి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చలించిపోయారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సంకల్పించారు. పట్టణంలోని రిక్షా కార్మికులందరికీ బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాక్‌డౌన్‌లో ప్రజలు బయటకు రాకపోవడం, పనులు లేకపోవడం వంటి కారణాలతో రిక్షా కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు ఈ నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆర్టీసీ కార్మికుల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్టీసీ డీఎం శ్రీహర్ష, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, ఆత్మచైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుళ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది: సండ్ర

కరోనా బాధితులకు ప్రాణవాయువు అందించేందుకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఇచ్చిన పిలుపుమేరకు అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ బెల్లం మధు (చిరాగ్ ఫౌండేషన్) స్పందించారు. రూ.1.10 లక్షల విలువైన ఐదు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను ఎమ్మెల్యే సండ్ర ద్వారా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వసుమతిదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆక్సిజన్ కొరతతో కరోనా బాధితులు ఇబ్బందులు పడకూడదని ప్రాణవాయువును అందించేందుకు ఎన్ఆర్ఐలు ముందుకురావడం శుభపరిణామమన్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రికి వీరపనేని రాధికా బాబీ దంపతులు, దొడ్డా శంకర్‌రావు, అద్దంకి అనీల్ సహకారంతో ఫ్లో మీటర్లను అందించారని, మధిర ప్రభుత్వ ఆసుపత్రికి సైతం ఇక్కడి దాతల సహకారంతో ఫ్లో మీటర్లు అందించినట్లు చెప్పారు.

# గ్రామంలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

జగిత్యాల, మే 31: సమస్యలను అధిగమిస్తూ రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజ య్‌కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల మండలంలోని చల్‌గల్ వ్యవసాయ మార్కెట్ యార్డు ను ఆదివారం ఆయన సందర్శించి వరిధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఐకేపీ, సహకార సంఘం, మార్కెట్ కమిటీల ఆధ్వర్యం లో దాదాపు 15లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని, జిల్లా వ్యాప్తంగా 45లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించామన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత వరి ధాన్యం కొనుగోలులో మన రికార్డులను మనమే బద్దలు కొట్టుకుంటూ ఇప్పటివరకు 45లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించామన్నారు. గత సంవత్సరం ఈ సమయం వరకు 42లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ చేశామని, ఈ సంవత్సరంలో ఆ రికార్డు 45లక్షలు దాటి ఇంకా ధాన్యం సేకరణ జరుగుతుందని, కొంతమంది నాయకులు, చుట్టపు చూపుగా వచ్చి రైతులను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారన్నారు.

ఇది రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతుల కోసం మంత్రి గంగుల కమలాకర్‌తో మొదటి నుంచి ధాన్యం సేకరణపై చర్చిస్తున్నామన్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న కరెంట్, రోడ్ల సమస్యను పరిష్కరించామని, కొత్త కేంద్రాలను ఏర్పా టు చేశామన్నారు. నీటి సదుపాయం కల్పించామన్నారు. ధాన్యం సేకరణలో కొంత ఆలస్యానికి లేబర్ కొరత, లారీల సమస్యే ప్రధాన కారణమన్నారు. వాటి పరిష్కారం కోసం నిత్యం అధికారులతో మాట్లాడుతున్నామని, రాయికల్, తాట్లవాయి, మైతాపూర్, మూటపెల్లిలో ఇంకా ధాన్యం నిల్వలున్నాయని, వాటిని పరిష్కరించాలని డీఎం సివిల్ సప్లయ్, డీఎస్‌వో, డీసీవో, కలెక్టర్‌తో మాట్లాడుతున్నామన్నారు. రైస్‌మిల్లులలో ధాన్యం నిండిపోతే ఇతర స్థలాల కోసం ప్రణాళిక తయారు చేశామన్నారు. దేశం మొత్తంలో ఇంతటి కరోనా కాలంలో ఏ రాష్ట్రం కూడా ఇంతపెద్ద ఎత్తున ధాన్యం సేకరణ చేపట్టలేదన్నారు. విమర్శించే నాయకులు వారి పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రా ల్లో సేకరణ లెక్కలతో సహా రావాలన్నారు. జగిత్యాల నియోజకవర్గ పరిధిలో ఐకేపీ, ప్యాక్స్, ఏఎంసీ కలిపి 113 కొనుగోలు కేంద్రాలను ఏర్పా టు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ ఎల్ల గంగనర్సు, రాజ న్న, ఏఎంసీ డైరెక్టర్లు మోహన్ రెడ్డి, బట్టు ప్రవీణ్, నాయకులు వెంకటేశ్, బాగోజి ముఖేశ్ ఖన్నా, పూదరి శ్రీనివాస్, మార్కెట్ సెక్రటరీ శేఖర్ పాల్గొన్నారు.

# మా చీఫ్ సెక్రటరీని రిలీజ్ చేయను.. మోదీకి స్పష్టం చేసిన మమత

కోల్‌కతా, మే 31: : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీకి తన నిరసన గళం వినిపించారు. తమ రాష్ట్ర చీఫ్ సెక్రటరీని కేంద్రానికి పంపించేది లేదంటూ ఆమె మోదీకి రాసిన లేఖలో స్పష్టం చేశారు. గత శుక్రవారం యాస్ తుఫానుపై మోదీతో జరిగిన సమావేశానికి మమత హాజరుకాకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్రం.. ఆ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఆలాపన్ బంద్యోపాధ్యాయ్‌ను వెంటనే ఢిల్లీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించింది. ఆయన సోమవారం ఉదయం 10 గంటలలోపే అక్కడ రిపోర్ట్ చేయాల్సి ఉంది.

కానీ మమత మాత్రం ఆయనను రిలీజ్ చేసేది లేదని తేల్చి చెబుతూ మోదీకి లేఖ రాయడం గమనార్హం. కేంద్రం ఏకపక్షంగా ఇచ్చిన ఆదేశం తనను షాక్‌కు గురిచేసిందని ఆమె ఆ లేఖలో చెప్పారు. బెంగాల్ ప్రభుత్వం ఇలాంటి తీవ్ర పరిస్థితుల్లో తన చీఫ్ సెక్రటరీని రిలీజ్ చేయదు. గతంలో ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ ఇచ్చిన చట్టపరమైన ఆదేశాలు చెల్లుబాటు అవుతాయని తాము భావిస్తున్నట్లు ఆ లేఖలో మమత స్పష్టం చేశారు.

బంద్యోపాధ్యాయ్ రాష్ట్రంలోనే కొనసాగుతారని, ఇక్కడి కొవిడ్ సంక్షోభ నిర్వహణను చూసుకుంటారని కూడా మమత అందులో తేల్చి చెప్పారు. ప్రధాని సమావేశానికి సీఎం మమత హాజరుకాకపోవడంపై సీరియస్ అయిన కేంద్రం కొన్ని గంటల వ్యవధిలోనే చీఫ్ సెక్రటరీ ఢిల్లీలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఆదేశాలు చట్టపరంగా చెల్లవని, ఇవి అసాధారణం, రాజ్యాంగ విరుద్ధమని తన లేఖలో మమత అన్నారు. రాష్ట్రంలో కొవిడ్ కేసులు తీవ్రమవుతున్న నేపథ్యంలో చీఫ్ సెక్రటరీని మరో మూడు నెలలు కొనసాగిస్తూ ఈ మధ్యే కేంద్రం ఆదేశాలు ఇవ్వడాన్ని లేఖలో మమత ప్రస్తావించారు.

# పొగాకు ఉత్పత్తుల దుర్వ్యసనంతో యువత చిత్తు

(31 మే 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం' సందర్భంగా)

పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్ల మీద 'పొగ త్రాగడం ఆరోగ్యానికి హానికరం' అనే హెచ్చరిక పెద్ద అక్షరాల్లో ముద్రించబడి ఉంటుంది. మన అనుమతితోనే నెమ్మదిగా నెమ్మదిగా కొద్ది కొద్దిగా ప్రాణాలను లాగేసే పొగాకు ఉత్పత్తుల దుష్ప్రభావం పలు వ్యాధులకు కారణమై చివరకు మరణమే శరణ్యం అవుతుంది. అన్నీ తెలిసిన నవ మానవుడు చావు నోట్లో తల పెట్టడం విచారకరం. పొగాకు దురలవాటుతో ప్రపంచవ్యాప్తంగా సాలీన 8 మిలియన్ల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ప్రతి ఏటా పరోక్షంగా 'సెకండ్ హాండ్ స్మోకింగ్' వల్ల ఒక మిలియన్ అమాయకులు చనిపోయడం జరుగుతున్నది. డబ్ల్యూహెచ్ఓ వివరాల ప్రకారం 20వ శతాబ్దంలో 100 మిలియన్ల మరణాలు పొగాకు కారణంగా జరిగాయని తేలింది. ప్రపంచ కాన్సర్ మరణాల్లో 25 శాతం పొగాకు వాడకంతోనే జరుగుతున్నాయి. ఈ ప్రాణాంతక దురలవాట్లకు బానిసలైన జనం నేడు కరోనా వలలో పడితే, అనారోగ్య అగ్నికి ఆజ్యం పోసినట్లు, అతి ప్రమాదకరం కానుందని వైద్యులు సూచిస్తున్నారు. పొగ తాగడంతో నేరుగా ఊపిరితిత్తులు బలహీణపడి, కోవిడ్-19 సోకిన వారిలో ఊపిరి అందక క్షణాల్లో కన్ను మూయడం చూస్తున్నాం. పొగాకు ఉత్పత్తుల్లో సిగరెట్, బీడి, చుట్ట, జర్దా, పొగాకు నమలడం, హీటెడ్ టొబాకో ప్రొడక్ట్స్, ముక్కు పొడి (నశం), టొబాకో క్రీమ్, పొగరాని పొగాకు, డోఖ, హుక్క, క్రెటెక్, రోలీస్, టొబాకో పైప్ లాంటివి అనేకం వస్తాయి. వీటిలో సిగరెట్, బీడీల దురలవాటు ఉన్న వారికి ప్రమాదం అధికంగా కనిపిస్తుంది. కరోనా కల్లోల సమయంలోనైన పొగాకు వాడకాన్ని త్యజించి, పోషకాహారం తింటూ, వ్యాధినిరోధకశక్తిని పెంచుకోవాలని సూచిస్తున్నారు. పొగాకు అలవాటును త్యజించడం కొంత కష్టమే అయినా పట్టుదలతో క్రమంగా పొగాకుకు దూరం కావాలనే అవగాహన కల్పించుటకు ప్రతి ఏటా 31 మే రోజున 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం' పాటించుట జరుగుతున్నది. ఈ వేదికగా సామాన్య ప్రజలకు, విద్యార్థినీవిద్యార్థులకు పొగాకు దురలవాటు పట్ల అవగాహన కల్పించడంతో పాటు 'పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ' చేయించాలి. 1987లో ఐరాస మరియు డబ్ల్యూహెచ్ఓలు సంయుక్తంగా 31 మే 1988 నుంచి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం నిర్వహించాలని తీర్మానించారు. ఈ ఏడాది నినాదంగా 'కమిట్ టు క్విట్' అనే అంశాన్ని తీసుకున్నారు.

పొగాకు వాడకాన్ని మానేసిన ఉత్తముల్లో హార్ట్ రేట్ తగ్గుతూ, రక్తంలో కార్బన్ మోనాక్సైడ్ స్థాయి పడిపోతూ, రక్త ప్రసరణ పెరిగి ఊపిరితిత్తులు చురుకుగా పని చేస్తాయి. దీనితో దగ్గు, శ్వాస ఇబ్బందులు తొలగి పోతాయి. పొగాకు వినియోగానికి సెలవు పలికితే గుండె జబ్బులు, స్ట్రోకులు మరియు లంగ్ కాన్సర్ అవకాశాలు తగ్గుతాయి. పొగాకు అలవాటుతో దంత సమస్యలు, చర్మం ముడతలు, దుర్వాసనలు, సొరియాసిస్, చర్మం/పెదవులపై మచ్చలు, కంటి జబ్బులు, వినికిడి లోపం, మానసిక క్షీణత, అల్జీమర్స్ వ్యాధి, మహిళల్లో రుతుస్రావ సమస్యలు, శరీర కణజాలానికి ఆక్సీజన్ కొరత, జీర్ణనాళ సమస్యలు, ఎముకల బలహీనత, వ్యాధి నిరోధకశక్తి తగ్గడం లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. పొగాకులో నికోటిన్ ఆక్కలాయిడ్ లాంటి 70కి పైగా ప్రమాదకర రసాయనాలు దుష్ప్రభావాలను కలుగిస్తున్నాయి. ఫస్ట్ అండ్ సెకండ్ హాండ్ స్మోకింగ్ వల్ల టిబి మరియు టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశం పెరుగుతుంది. ఈ-సిగరెట్ల వాడకంతో కౌమార దశ యువత మరియు పిల్లలు అనారోగ్యాల పాలు అవుతున్నారు. పొగాకు దురలవాటుతో ఆరోగ్యానికే కాకుండా ఆర్థిక స్థితికి కూడా నష్టం కలుగుతూ, సమాజంలో చిన్న చూపుకు లోనవుతారు. ఆరోగ్యానికి అతి హానికరమని ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వాలు పొగాకు, ఆల్కహాల్, మాదకద్రవ్యాలను నిషేధిస్తే బాగుంటుందని బాధ్యతగల పౌరులు సూచిస్తున్నారు. అందరికి సులభంగా అందుబాటులో ఉన్నపుడు దురలవాటును మానడం అతి కష్టం.

ఒక సగటు వ్యక్తి తన జీవితకాలంలో పొగాకు వాడకంతో వ్యక్తిగత ధనం, వైద్య ఖర్చులు, పనిలో శ్రద్ద తగ్గడం, కార్యదక్షత తగ్గడం లాంటి కారణాలతో 1.4 మిలియన్ల డాలర్ల ధననష్టం మరియు 10 ఏండ్ల జీవిత కాలం తగ్గుతుందని అంచనా వేయబడింది. పొగాకు అలవాటుతో పేదరికం పెరుగుతూ, నిత్యావసరాలకు లోటు కలుగుతుంది. పురుషుల్లో పొగాకు అలవాటుతో సంతానం కలగడం కష్టం కావచ్చు. స్త్రీలలో పొగాకు అలవాటుతో సంతానలేమి జరుగుతుంది. పొగాకు దురవాటుకు లోనైన వారిలో 50 శాతం మందిలో జీవితకాలం తగ్గుతుంది. పొగాకును నోట్లో పెట్టుకుని నమిలే దురలవాటు ఉన్న వారిలో నోటి కాన్సర్, దంతాలు బలహీనపడడం, దంతాలు రంగు మారడం, చిగురు జబ్బులు, పెదవుల మచ్చలు మరియు తెల్ల మచ్చలు కనిపిస్తాయి. పొగాకు వాడకం పెరిగిన కొద్దీ దేశ పేదరికం కూడా పెరుగుతుంది. సిగరెట్ తాగిన తరువాత వదిలే పీకలతో ఆర్సినిక్, లెడ్, నికోటిన్, ఫార్మాల్డిహైడ్ లాంటి ప్రమాదకర రసాయనాలు మరియు పొగతో కార్బన్ మోనాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్ మరియు మిథేన్‌లు విడుదలై పర్యావరణానికి హాని కలుగుతుంది. విశ్వవ్యాప్తంగా సాలీన 6 ట్రిలియన్ల సిగరెట్లు త్రాగడానికి వాడుకునే 3 ట్రిలియన్ల అగ్గి పెట్టలు తయారు చేయడానికి 9 మిలియన్ల చెట్లు నరకడం జరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 2 లక్షల హెక్టార్లలో పొగాకు పంట పండుతూ, కొన్ని ప్రదేశాల్లో అడవులు నరికివేస్తూ పొగాకు పంట పండించడం జరుగుతున్నది. పొగాకు దురలవాటుకు తిలోదకాలిచ్చి, కుటుంబ సౌభాగ్యాలకు పునాదులు వేసుకోవడానికి తక్షణమే కంకణబద్దులం అవుదాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ములుగు జిల్లాలో మావోయిస్టు మిలీషియా సభ్యుడి అరెస్ట్

ములుగు,మే 31: : జిల్లాలోని పాముసూరు అటవీ ప్రాంతంలో నిన్న మావోయిస్టు మిలీషియా సభ్యుడిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతన్ని ఇవాళ మీడియా ముందు ప్రవేశపెట్టారు. పోలీసులపై బాంబు దాడులు జరిపేందుకు పాముసూరు అటవీ ప్రాంతంలో కుట్ర జరుగుతోందని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో పోలీసు బలగాలు పాముసూరు అటవీ ప్రాంతం వైపు వెళ్లాయి. కూంబింగ్ నిర్వహిస్తుండగా ఆదివారం ఉదయం 11 గంటలకు రోడ్డుపై బాంబులు అమర్చుతున్న కొంతమందిని పోలీసులు గమనించారు.

అప్రమత్తమైన బలగాలు.. వారిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా అందరూ తప్పించుకున్నారు. ఒకర్ని మాత్రమే పోలీసులు పట్టుకోగలిగారు. అతన్ని అదే రోజు సాయంత్రం 4 గంటలకు వెంకటాపురం పీఎస్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్నవ్యక్తిని వెంకటాపూరం నూగూరు మండలంలోని జల్లా గ్రామానికి చెందిన మడవి భూదు(40)గా పోలీసులు గుర్తించారు. భూదు నుంచి కార్డెక్స్ వైర్(40 మీటర్లు), నాలుగు డిటోనేటర్లు, ఒక వాకీ టాకీ, 2 ప్రెషర్ కుక్కుర్ బాంబులు, 2 టిఫిన్ బాక్స్ బాంబులు, రెండు ఎలక్ట్రిక్ వైర్ కట్టలు, బ్యాటరీలతో పాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

# నకిలీ విత్తనాల సరఫరాను, నాసిరకం ఎరువులను అరికట్టేందుకు పటిష్ట చర్యలు

-నకిలీ విత్తనాల సరఫరా వ్యాపారస్తుల పై పీడీ యాక్ట్ అమలుకు వెనుకాడబోం
-నకిలీ విత్తనాలు అమ్మే వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి
-జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే , జిల్లా వ్యవసాయ అధికారి రణధీర్ రెడ్డి






రాజన్న సిరిసిల్ల మే, 31(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నకిలీ విత్తనాలను, అనుమతి లేని నాసిరకం పురుగుల మందులను అమ్ముతూ రైతులను మోసం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆ న్నారుసోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ లు,స్టేషన్ హౌస్ఆఫీసర్లు ,మండల స్థాయి అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాఎస్పీమాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారి పై, మాయమాటలు చెప్పి రైతులను మోసాగించే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని జారీ చేసిన ఉత్తర్వులలో భాగంగా నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఆయన అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి పై నిఘా ఉంచడానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్ఫోర్స్ టీం ను, మరియు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మండల స్థాయిలో మరో టాస్క్ ఫోర్స్ టీం ను ఏర్పాటు చేయడం జరిగిందని వారు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తారు అని తెలిపారు.వ్యాపారులు స్టాకు లైసెన్సు బిల్ బుక్కులు తదితర వివరాలు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాపారులు రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో అన్ని వివరాలతో కూడిన రసీదులు తప్పకుండా ఇవ్వాలని అత్యాశకు పోయి నకిలీ విత్తనాలు విక్రయించి జైలుపాలు కాకూడదని ఎస్పీ గారు తెలిపారు. జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో నిరంతరంగా ఆకస్మిక తనిఖీలు చేపడతామని నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు అలాగే రైతులు కూడా విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని లైసెన్సు కలిగిన వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి రసీదులు తప్పకుండా తీసుకోవాలని అన్నారు.

గత సంవత్సరం లో కూడా నకిలీ విత్తనాల పై కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేశామన్నారు.నకిలీ విత్తనాలు, పురుగుల మందులు అమ్మే వారి పట్ల రైతులుఅప్రమత్తంగా ఉ ఒడాలని ఎస్పీ కోరారు.జిల్లా లో ఎవరైనా ఆర్గనైజర్లమంటూ నకిలీ సీడ్స్ ను అమ్ముతున్నట్లు, సరఫరా చేస్తున్నట్లు తమ దృష్టి కి వచ్చిన రైతులు సంబంధిత పోలీస్ లేదా వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకరావాలి, లేదా డయల్ 100 కు సమాచారం అందించిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుంది మరియు సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడును.జిల్లా లో ఎవరైనా నకిలీ సీడ్స్ ను అమ్మిన, సరఫరా చేసిన, అలాంటి వారికి సహకరించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు అన్నారు.గతం లో నమోదు అయిన కేసుల ఆధారంగా అవసరమైతే పి. డి యాక్ట్ కేసులు కూడా నమోదు చేయడానికి వెనుకాడబోము అని నకిలీ విత్తనాలు అమ్మేవారికి, వాటిని నరఫరా చేసే వారికి ఎస్పీ హెచ్చరించారు.జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రణధీర్ గారు మాట్లాడుతూ....

ఎలాంటి గుర్తింపు లేని ఆర్గనైజర్ నుండి ధృవీకరించబడని విత్తనాలను రైతులు కొని ఆరు నెలల పాటు కష్టపడి పంటను పండించి నష్టాల పాలై తమ కుటుంబాలను ఆర్థికంగా వెనుకబాటు చేసుకోవద్దని, రైతులు నకిలీ విత్తనాలను కొని మోసపోకుండా విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండి, ఒకటికి రెండు సార్లు సరిచూసుకొని కంపెనీ ధృవీకరించబడిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. పత్తి సాగు చేయాలనుకునే రైతులు సర్టిఫైడ్ కంపెనీ సీడ్ ఆర్గనైజర్ వద్దనే విత్తనాలు తీసుకోవాలని, వాటిని రైతులు కొనుగోలు చేసినప్పుడు ఆర్గనైజర్ నుండి రశీదు పొందాలని, అలాగే తీసుకున్న ప్యాకెట్ కవర్స్ ను పంట పూర్తి అయ్యేవరకు రైతులు తమ దగ్గరే ఉంచుకున్నట్లైతే ఆయా విత్తనాలను సాగు చేయడం వల్ల రైతు నష్టాలు పొందినట్లైతే సంబంధిత ఆర్గనైజర్ ను, కంపెనీని, బాధ్యులను చేయుటకు రైతు తీసుకున్న రశీదు, ప్యాకెట్ కవర్లు ఒక ఆధారంగాఉ పయోగపడుతాయని అట్టి ఆర్గనైజర్, కంపెనీ పై కఠిన చర్యలు తీసుకొనుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పీ లు చంద్రశేఖర్ ,రవికుమార్ ,సి.ఐ లు ఎస్.ఐ లు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు...

# ప్రభుత్వ విప్ సుమన్‌ను పరామర్శించిన మంత్రి కొప్పుల



జగిత్యాల, మే 31: : రాష్ట్ర ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, మెట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్క సురేష్ (60) అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, సోమవారం సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సుమన్‌ను పరామర్శాంచారు. ఎమ్మెల్యే సుమన్ స్వగ్రామం రేగుంట (మెట్‌పల్లి)లో సురేష్ చిత్ర పటానికి పూల మాలవేసి మంత్రి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు బోర్లకుంట వెంకటేష్ నేత, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, జగిత్యాల జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి ఉన్నారు.

# అక్కడ జూన్ 8 వరకు లాక్‌డౌన్ పొడిగింపు

పట్నా, మే 31: : దేశంలో కరోనా సెకండ్ వేవ్ ప్రభావం రోజురోజుకూ తగ్గుతున్నప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా దాదాపు అన్ని రాష్ట్రాలు లాక్‌డౌన్‌ను మరికొంతకాలం పొడిగిస్తున్నాయి. ఇప్పటికే తెలంగాణ, ఉత్తరప్రదేశ్, హర్యానా తదితర రాష్ట్రాలు లాక్‌డౌన్‌ను పొడిగిస్తూ నిర్ణయం తీసుకోగా.. తాజాగా బీహార్ రాష్ట్రం సైతం లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్లు ప్రకటించింది.

కరోనా మహమ్మారి కట్టడి కోసం మరో వారం రోజులు లాక్‌డౌన్‌ను పొడిగించాలని నిర్ణయించినట్లు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. లాక్‌డౌన్ నిబంధనలను ప్రజలంతా తూచా తప్పకుండా పాటించాలని, అందరూ మాస్కులు ధరించడంతోపాటు సామాజిక దూరం పాటించాలని నితీశ్ కోరారు.

# కరోనా సేవలకు కేరాఫ్ అడ్రస్..జమాతే-ఇస్లామి-హింద్

-ఆపత్కాలంలో అన్నదానం అభినందనీయం
-నగర మేయర్ యాదగిరి సునీల్ రావు




రాజన్న సిరిసిల్ల మే, 31(నేటినిజం ప్రతినిధి): ఎలాంటి ప్రకృతి విపత్కర పరిస్థితులు వచ్చినా.. ఆ సమయంలో చేయుతనందించేందుకు సమాజంలో అందరి కంటే ముందుగా జమాతే ఇస్లామి హింద్ సేవల్లో అగ్రభాగాన నిలుస్తోందని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు.

ఆదివారం రాత్రి జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో కోవిడ్-19 తో చికిత్స పొందుతున్న రోగుల బంధువులకు, కుటుంబ సభ్యులకు నిత్యాన్నదాన కార్యక్రమానికి మేయర్ సునీల్ రావు, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై రాత్రి భోజనం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం కోవిడ్ రెండోదశ ఉగ్రరూపం దాల్చడంతో వందలాది మంది కోవిడ్ బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి సేవలను అందిస్తున్న రోగుల కుటుంబ సభ్యులు లాక్ డౌన్ వల్ల అన్నం, మంచినీరు అందుబాటులో లభించక విపత్కర పరిస్థితుల్లో కొట్టుమిట్టా డుతున్న నేపథ్యంలో మానవతా దృక్పతం తో జమాతే-ఇస్లామి-హింద్ కరీంనగర్ శాఖ ద్వారా లాక్ డౌన్ ఎత్తివేసే వరకు అన్న దానం చేసే గొప్ప విషయమన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని చాటి చెప్పే క్రమంలో జమాతే ఇస్లామి సంస్థ సేవల్లో అగ్రభాగాన నిలుస్తుందన్నారు. జమాతే ఇస్లామి సేవలకుఎవరు సాటి రారాన్నారు.

ఈకార్యక్రమంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, సహాయ కార్యదర్శి సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, కార్పొరేటర్లు మహమ్మద్ శర్ఫుద్దీన్, అఖీల్ ఫిరోజ్, ఆతిన, జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖైరోద్దీన్, షోయబ్ లతీఫ్, ఉ మెర్ అహ్మద్ ఖాన్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈపిఎఫ్ఓ తన సభ్యులకు రెండవ విడత కోవిడ్-19 అడ్వాన్స్ పొందటానికి అనుమతిచ్చింది

న్యూఢిల్లీ, మే 31: కోవిడ్ -19 మహమ్మారి రెండవ వేవ్ లో తన ఖాతాదారులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఈపిఎఫ్ఓ ఇప్పుడు దాని సభ్యులకు తిరిగి చెల్లించనవసరం లేని రెండవ కోవిడ్-19 అడ్వాన్స్ పొందటానికి అనుమతించింది. మహమ్మారి సమయంలో సభ్యుల ఆర్థిక అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఉపసంహరణను 2020 మార్చిలో ప్రధాన్ మంత్రి గారిబ్ కళ్యాణ్ యోజన (పిఎంజికెవై) కింద ప్రవేశపెట్టారు. అధికారిక గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా పేరా 68 ఎల్ కింద ఉ ప-పారా (3) ను చేర్చడం ద్వారా కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్ పథకం 1952 లో ఈ సవరణ చేశారు.

ఈ నిబంధన ప్రకారం, మూడు నెలల పాటు ప్రాథమిక వేతనాలు, కరువు భత్యం తిరిగి చెల్లించనవసరం లేని విధంగా తీసుకోవొచ్చు లేదా ఇపిఎఫ్ ఖాతాలో సభ్యుల క్రెడిట్‌కు 75% వరకు, ఏది తక్కువైతే అది పొందవచ్చు. సభ్యులు తక్కువ మొత్తానికి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.మహమ్మారి సమయంలో కోవిడ్ -19 అడ్వాన్స్ ఇపిఎఫ్ సభ్యులకు గొప్ప సహాయంగా ఉంది, ముఖ్యంగా నెలవారీ వేతనాలు రూ. 15,000 ఉ న్నవారికి ఉపయోగంగా ఉంది. ఇప్పటి వరకు ఈపిఎఫ్ఓ 76.31 లక్షలకు పైగా కోవిడ్-19 అడ్వాన్స్ క్లెయిమ్‌లను పరిష్కరించింది. తద్వారా మొత్తం రూ. 18,698.15 కోట్లు చెల్లించింది. ప్రస్తుత పరిస్థితుల్లో సభ్యులకు అకస్మాత్తుగా అవసరం వచ్చినపుడు కోవిడ్-19 క్లెయిమ్ లకు అధిక ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించారు. ఈ క్లెయిమ్ లు అందిన వెంటనే మూడురోజుల్లోపు పరిష్కరించడానికి ఈపిఎఫ్ఓ కట్టుబడి ఉంది. ఈపిఎఫ్ఓ అటువంటి సభ్యులందరికీ సంబంధించి ఆటో-క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రాసెస్‌ను ఏర్పాటు చేసింది. దీని కేవైసి అవసరాలు అన్ని విధాలుగా పూర్తయ్యాయి. ఇంతకు ముందు క్లెయిమ్‌ల పరిష్కరించడానికి చట్టబద్ధమైన కాలపరిమితి 20 రోజులు ఉన్న విధానాన్ని ప్రస్తుత ఆటో-మోడ్ ఆఫ్ సెటిల్మెంట్ కేవలం 3 రోజులకె పరిష్కరిస్తుంది.

# కరోనా బాధిత జర్నలిస్టుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం

లక్నోమే 31: : దేశంలో కరోనా సెకండ్ వేవ్ విలయం సృష్టిస్తున్నది. ప్రతిరోజు వేల సంఖ్యలో బాధితులు కన్నుమూస్తున్నారు. ఇందులో జర్నలిస్టులు కూడా ఉన్నారు. దీంతో కరోనాతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఉ త్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్లు సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. హిందీ జర్నలిజం దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన సభలో ఈ మేరకు ప్రకటన చేశారు. జర్నలిస్టులను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పారు.

కరోనా కష్టకాలంలోనూ జర్నలిస్టులు 24 గంటల పాటు పనిచేస్తూ సమాచారాన్ని అందిస్తున్నారని వెల్లడించారు. మహమ్మారి సెకండ్ వేవ్‌లో దేశవ్యాప్తంగా చాలా మంది జర్నలస్టులు ప్రాణాలు కోల్పోయారని చెప్పాం ఏ. వారి కుటుంబాలను ఆదుకుంటామని స్పష్టం చేశారు.

# రైతులకు జనుము విత్తనాలు పంపిణీ



సంగారెడ్డి,మే 31: మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు ఏడాకులపల్లి సొసైటీలు, రైతులకు జనుము విత్తనాలను జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సబ్సిడీపై అందజేస్తున్న జనుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతుల్లో సాగు చేసి అధిక లాభాలు పొందాలని ఎంపీ సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు .జెడ్పీచైర్ పర్సన్ మందు శ్రీ జైపాల్ రెడ్డి, ఉ మ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపూర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

# నారాయణపేట జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

నారాయణపేట, మే 31: : జిల్లాలోని ఊట్కూర్ మండల పరిధిలోని పెద్దజట్రం గ్రామంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లను పట్టుకున్నారు. ఎస్ఐ రవి కథనం మేరకు.. గ్రామానికి చెందిన నర్సింలు గౌడ్ రైతులకు నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో సోమవారం మధ్యాహ్నం టాస్క్ ఫోర్స్ పోలీసులు అతడి ఇంటిపై దాడులు నిర్వహించారు.

15 పల్లవి నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు (500) గ్రా. మరో 15 లూజ్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకుని మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డికి అప్పగించారు. వీటి విలువ రూ.15,000 వేలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

# బాధిత కుటుంబాలకు మంత్రి కొప్పుల పరామర్శ

పెద్దపల్లి మే 31: జిల్లాలోని పాలకుర్తి మండలం ముంజంపల్లి గ్రామంలో టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పందిళ్ల రాజిరెడ్డి తండ్రి నర్సింహారెడ్డి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు పందిరి నారాయణ తల్లి రామక్క, టీఆర్ఎస్ నాయకుడు చొప్పదండి తిరుపతి తండ్రి మల్లయ్య అనారోగ్యం కారణంగా మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాలను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు.

# మధ్యాహ్నం 2 తర్వాత అనవసరంగా రోడ్లపైకి రావద్దు.

-జిల్లాలో మరింత కఠినంగా లాక్ డౌన్ అమలు -జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే



రాజన్న సిరిసిల్ల మే, 31(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో మరింత కఠినంగా లాక్ డౌన్ ను అమలు చేస్తామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు సోమవారం జిల్లా ఎస్పీ మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ మరియు అంబేద్కర్ చౌరస్తా ల వద్ద లాక్ డౌన్ అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించి వాహనాల తనిఖీ నిర్వహిం చారు. జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ..లాక్ డౌన్ మరో పది రోజులపాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మధ్యాహ్నం ఒంటి గంటల వరకు దుకాణ సముదాయాలు,షాప్స్ మూసివేయాలి అని అన్నారు.ఒకటి తరువాత తెరచి ఉన్న దుకాణాలు,షాప్స్ ను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు.రెండు గంటల తర్వాత ఎలాంటి పాస్ లు లేకుండా అనవసరంగా బయటకు వచ్చే వాహనాలపై కఠినంగా వ్యవహరించి సదరు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుంది అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సడలింపు సమ యాన్ని అదనంగా మరో మూడు గంటల పాటు పెంచిందని ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని రకాల వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతాయని కావున ప్రజలు మినహాయింపు సమయంలో బయటకు వచ్చినప్పుడు భౌతిక దూరం పాటిస్తూ కరోనా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ గారి వెంట డీఎస్పీ చంద్రశేఖర్ ,పట్టణ సి.ఐ అనిల్ కు మార్ ట్రైని ఎస్.ఐ లు సిబ్బంది ఉన్నారు

# ఎన్‌హెచ్‌ఆర్‌సీకి రఘురామ ఫిర్యాదు

న్యూఢిల్లీ, మే 31: ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్ పిసి.పంత్‌ను నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు కలిశారు. సీఐడీ పోలీసులు విచారణలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఫిర్యాదు చేశారు. సీఐడీ పోలీసులు మానవ హక్కుల ఉ ల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పటికే ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఎంపీ కుమారుడు భరత్ కూడా ఫిర్యాదు చేశారు. భరత్ ఫిర్యాదుపై ఇప్పటికే అంతర్గత విచారణకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది. అంతేకాదు రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ, సీఐడీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు కూడా జారీ చేసింది. సీఐడీ అధికారుల తీరును స్వయంగా కలిసి ఎంపీ రఘురామ వివరించారు. మొత్తం వ్యవహారంపై విచారణ చేస్తామని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్ హామీ ఇచ్చారు.కాగా, నిన్న రక్షణ మంత్రి రాజ్ నాథ్ ని కూడా ఫిర్యాదు చేశారు. రఘురామ వీల్ చెయిర్ లోనే రాజ్ నాథ్ సింగ్ నివాసానికి వెళ్లారు. రాజ్ నాథ్ తో కొద్దిసేపు సమావేశమయ్యారు. సీఐడీ కేసు నుంచి ఎయిమ్స్ లో చికిత్స వరకు ఇటీవల జరిగిన పరిణామాలను కేంద్రమంత్రికి క్లుప్తంగా వివరించారు. ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా తనపై ఏపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ఆయనకు ఫిర్యాదు చేశారు.సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రఘురామ ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందిన సంగతి తెలిసిందే. రాజద్రోహం కేసులో అరెస్టయిన రఘురామను కస్టడీలో ఏపీ పోలీసులు వేధించారన్న ఆరోపణలు రావడం సంచలనం సృష్టించింది. పోలీసులు కొట్టడం వల్ల తగిలిన దెబ్బలు అంటూ రఘురామ ఆరోపించారు. ఈ వ్యవహారం సీఐడీ కోర్టు పరిధిని దాటి హైకోర్టు, ఆపై సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఈ క్రమంలో ఆయనకు సికింద్రాబాద్ ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స అందించారు. సుప్రీ ంకోర్టు బెయిల్ ఆదేశాలు ఇవ్వడంతో విడుద లైన ఆయన, మెరుగైన చికిత్స కోసం ఢిల్లీ ఎయిమ్స్ లో చేరారు. ఆయన రెండు కాళ్లకు కట్లు కట్టిన ఎయిమ్స్ వైద్యులు, కొన్నిరోజుల పాటు నడవరాదని సూచించారు.

# జూన్ 20 తర్వాత స్పుత్నిక్ వీ టీకాల తొలి బ్యాచ్ రాక

న్యూఢిల్లీ, మే 31: స్పుత్నిక్ వీ వ్యాక్సిన్ తొలి బ్యాచ్ జూన్ 20 తర్వాత దేశ రాజధానికి చేరుతుందని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వెల్లడించారు. రష్యా వ్యాక్సిన్ స్పుత్నిక్ వీను ప్రస్తుతం మనం దిగుమతి చేసుకుంటున్నామని భారత్ లో ఆగస్ట్ నుంచి ఈ వ్యాక్సిన్ ఉత్పత్తి చేపడతారని చెప్పారు. ఇక ఢిల్లీలో కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది.కేసుల తగ్గుదలతో కరోనా రోగులకు సులువుగా బెడ్ లు, ఆక్సిజన్ అందుబాటులోకి వచ్చాయని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇక దేశ రాజధానిలో కరోనా పాజిటివిటీ రేటు 1.25 శాతానికి దిగివచ్చింది. ఇక గడిచిన 24 గంటల్లో ఢిల్లీలో 946 తాజా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మరోవైపు ఢిల్లీలో గత 47 రోజుల్లో ఆదివారం అతితక్కువగా కరోనా మరణాలు 100 లోపు పడిపోయా యని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

# మానవ సేవే మాధవసేవగా కరోనా కష్టకాలంలో సైనికులుగా పని చేస్తున్న టిఆర్ కె ట్రస్ట్

మరోసారి తమ సేవకు శ్రీకారం చుట్టిన టి ఆర్.కె ట్రస్ట్
-కరోనా బాధితులకు ఆహార ప్యాకెట్లు పంపకం

రాజన్న సిరిసిల్ల మే, 31(నేటినిజం ప్రతినిధి): కరోనా మహమ్మారి బారిన పడి ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు..... ఇంకొందరు ఆస్పత్రిలో చావు బ్రతుకుల మధ్య పోరాడుతున్నారు....

అలాంటి వారికి మనోధైర్యం నింపుతూ.మేమున్నామని భరోసా కల్పిస్తూ తోట రామ్ కుమార్ ట్రస్ట్ ఆహార ప్యాకెట్లు లు పంపిణీ చేశారు ఇందులో భాగంగానే సోమవారం 17వ రోజు... నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రి భవనంలో వైద్యాధికారి మహేష్ రావు ఆధ్వర్యంలో కోవిడ్ మహమ్మారి బారిన పడి చికిత్స పొందుతున్న వారికి, కోవిడ్ బాధిత కుటుంబ సభ్యులకు, కోవిడ్ వ్యాక్సినేషన్ సెంటర్లలో పని చేస్తున్న వైద్య సిబ్బందికి తమ వంతు సహాయంగా టి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లను ట్రస్టు సభ్యులు పంపిణీ చేసి తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ కోవిడ్ బారిన పడి ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వారికి పౌష్టిక ఆహారం అందించాలనే దృఢసంకల్పంతో ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ ఆహారం అందజేస్తున్నారని, వారు త్వరగా కోలుకోవాలని అన్నారు. ఆపద సమయంలో టి ఆర్ కె ట్రస్ట్ సేవలు ఎల్లప్పుడూ ముందు ఉంటాయని, ఆపదలో ఉన్నవారు తమ ట్రస్టును సంప్రదిస్తే వారికి తమ వంతు సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో

టి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీం, ఎంక్వైరీ టీం సభ్యులు పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com